నీలగిరి నిత్యపద్యం

ఆటవలది
కష్ట నష్టములును కదలి అలలవోలె
కదలి వచ్చు నంట క్రమముగాను
చింత పడక వాని సంతసంబుగ నీవు
స్వీకరించ గాను శ్రేయమనర
మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక

| సంచిక 58 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | ఆగస్టు 26, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00 |
|---|---|---|---|---|---|---|---|



విలేకరులు కావలెను

నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక మరియు చైతన్యగళం ఛానెల్ లో పనిచేయుటకు మండల విలేఖర్లు, నియోజకవర్గ,జిల్లా ఇంచార్జీలు, క్రైమ్ రిపోర్టర్లు కావలెను.

పూర్తి వివరాలకు
తెలంగాణ - 9705770909,
ఆంధ్రప్రదేశ్ -9491163914
లను సంప్రదించగలరు.




## త్వరత్వరగా మూసీ భూసేకరణ

- న్యాయపరమైన చిక్కులు లేకుండా నిర్వహణ
- అధికారుకు సిఎం రేవంత్ ఆదేశం

**హైదరాబాద్,ఆగష్టు25 :** మూసీ ప్రాజెక్ట్ కోసం భూ సేకరణను వేగవంతం చేయాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ల్యాండ్ పూలింగ్‌పైన స్పష్టమైన విధానం రూపొందించు కోవాలన్నారు. మూసీ ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఎఫ్టీఎల్, బఫర్ జోన్, అసైన్డ్ భూముల

మిగతా2లో...

## శాసన వ్యవస్థలో కమిటీలకు ఎంతో ప్రాధాన్యత

● సూచనలు, సలహాల్లో కమిటీలదే కీలక భూమిక ● పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చూడాలి ● శాసనమండలి కమిటీల సమావేశంలో గుత్తా, గడ్డం, ప్రసాద్‌ల సూచన




**హైదరాబాద్,ఆగష్టు25 :** శాసన వ్యవస్థలో కమిటీలకు ఎంతో ప్రాధాన్యత ఉన్నది. ప్రజల సమస్యలను లోతుగా అధ్యయనం చేసి, వాటి పరిష్కారానికి ప్రభుత్వానికి అవసరమైన సూచనలు, సిఫారసులు చేయడంలో కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వ హయాంలో షెడ్యూల్ తెగల వారికి సబ్సిడీ పథకాలు అమలు కాక లబ్దిదారులు నేటికీ సబ్సిడీ పేపర్లను పట్టుకొని తిరుగుతున్నారు. అలాంటి

మిగతా2లో...



## ఏడాదిలో దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేయడమే లక్ష్యం

- స్పష్టమైన కార్యాచరణతో పనులు వేగవంతం చేయాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**హైదరాబాద్,ఆగష్టు25 :** దేవాదుల ప్రాజెక్టును ఏడాదిలోగా వందశాతం పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం నాడు జలసౌధలో దేవాదుల ప్రాజెక్టు పై జరిగిన

మిగతా2లో...

## తెలుగు రాష్ట్రాల మధ్య రహదారి అభివృద్ధి

రూ.840.41 కోట్లతో విస్తరణకు కేంద్రం ఆమోదం
కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి



2లో

## వనమహోత్సవ లక్ష్యాన్ని చేరుకోవాలి

- నాటిన ప్రతి మొక్కను రక్షించుకోవాలి
- ప్రతి ఒక్కరికి పని కల్పించి ఆదుకోవాలి
- అధికారులను ఆదేశించిన మంత్రి సీతక్క



2లో

## సీజనల్ వ్యాధులపై దృష్టి పెట్టండి

● వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి ● ఎల్‌నినో ప్రభావంతో పంటల మార్పిడి జరగాలి ● నీట్ పరీక్ష పక్కాగా జరిగేలా చర్యలు ● కలెక్టర్లకకు సిఎస్ సంజయ్ జాజు దిశానిర్దేశం



2లో

## విద్యార్థుల జీవితాలతో ఆటలొద్దు

- ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి
- సిఎం రేవంత్‌కు బాధ్యతారాహిత్యం కూడదు
- బిజెపి సభలో ఎంపి ఈటలె రాజేందర్ విమర్శలు
- స్వల్పంగా దెబ్బతిన్న రామచంద్ర రావు ఆరోగ్యం



**హైదరాబాద్,ఆగష్టు25 :** 20 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దని అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి అంటే అర్థం ఏంటో తెలుసా అని ప్రశ్నించారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల గురించి ఆలోచించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిదేనని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. 'ఫీజు బకాయి - భాజపా లడాయి' పేరుతో

మిగతా2లో...

## సిఎం రేవంత్ యూఎస్ పర్యటనపై వివరణ ఇవ్వాలి

- ఎందుకు అమెరికా పర్యటనో వివరంగా చెప్పాలి
- మేయర్ మమ్దానీని ఎందుకు కలవాలనుకున్నారో చెప్పాలి
- నిబంధనల మేరకే కేంద్ర విదేశాంగశాఖ నిర్ణయాలు
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టీకరణ




**న్యూఢిల్లీ,ఆగష్టు25 :**అమెరికా పర్యటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్లారిటీ ఇవ్వాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. రాజకీయ కారణాలతోనే తన యూఎస్ పర్యటనను కేంద్రం అడ్డుకుందంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కిషన్ రెడ్డి తోసిపుచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఢిల్లీలో ఆయన స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు అర్థరహితం అని కొట్టిపారేశారు.

మిగతా2లో...



## 22ఎ భూములపై సిట్టింగ్ జడ్జితో విచారణ

- పొంగులేటిని వెంటనే బర్తర్ఫ్ చేయాలి
- అసెంబ్లీలో ఈ అంశంపై సర్కార్‌ను నిలదీస్తాం
- బిఆర్ఎస్ నేత హరీశ్ రావు డిమాండ్

**హైదరాబాద్,ఆగష్టు25 :** మొత్తం 22ఎ నిషేధిత భూముల అక్రమాలపై తక్షణమే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, అసలు ఈ భూములను ఎవరు నిషేధిత జాబితాలో పెట్టమన్నారో నిజాలు బయటపడాలని బిఆర్ఎస్ నేత హరీశ్ రావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే ఈ వ్యవహారంపై శ్వేతపత్రం విడుదల చేయాలని, నిషేధిత జాబితాను వెబ్‌సైట్‌లో

మిగతా2లో...

## వారిపై చర్యలు ఉంటాయి: మల్లు రవి



**హైదరాబాద్ ఆగష్టు25 :** మంత్రి కొండా సురేఖ, చిన్నారెడ్డిపై పూర్తి అంశాలతో నివేదికను పొందు పరిచి టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌కు అందజేశామని క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి స్పష్టం చేశారు. దీనిని పార్టీ రాష్ట్ర వ్యవహారాల

మిగతా2లో...

బుధవారం, ఆగస్టు 26, 2026

RNI - TELTEL/2023/87644
నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక



# శాసన వ్యవస్థలో కమిటీలకు ఎంతో ప్రాధాన్యత

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితి రాకుండా చూడాల్సిన బాధ్యత కమిటీ ఛైర్మన్ మరియు సభ్యులపైన ఉన్నదన్నారు. గిరిజనులు, వెనుకబడిన తరగతులు, మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కమిటీలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

సంక్షేమ పథకాల అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కార మార్గాలను సూచించాలి. కమిటీల సభ్యులు ప్రజల నుంచి వచ్చే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ... లెజిస్లేటివ్ కమిటీలు ప్రభుత్వం మరియు ప్రజల మధ్య ఒక ముఖ్యమైన వారధిగా పని చేయాలన్నారు. తద్వారా పథకాల అమలులో ప్రభుత్వం మెరుగైన ఫలితాలు సాదించేందుకు మరియు ప్రజలకు పథకాలు మరింతగా చేరువయ్యేందుకు ఉపయోగపడుతుంది. తెలంగాణ రాష్ట్ర జనాభాలో 10.45 శాతం మంది ఉన్న షెడ్యూల్డ్ తెగల జీవన పరిస్థితులను అధ్యయనం చేయడం, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల అమలు తీరును సమీక్షించడం, లోటుపాట్లను గుర్తించడం, వారి సమగ్ర అభివృద్ధికి అవసరమైన సూచనలను ప్రభుత్వానికి అందించడం ఈ షెడ్యూల్ తెగల సంక్షేమ కమిటీ ప్రధాన కర్తవ్యం అన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం మరియు సమ్మిళిత అభివృద్ధి అనే ఆదర్శాల పట్ల మనందరి సమిష్టి నిబద్ధతకు వెనుకబడిన తరగతుల సంక్షేమ కమిటి ప్రతీక. కమిటీలు ప్రజల అవసరాలను అర్థం చేసుకుని, అర్థవంతమైన సిఫార్సుల ద్వారా వారి జీవన నాణ్యతను మెరుగుపరచడానికి దోహదపడాలి.

మహిళల భద్రత మరియు ఆర్థిక సాధికారతకు సంబంధించిన పథకాలు, శిశు సంక్షేమ సంస్థలు మరియు అంగన్వాడీల పనితీరు, దివ్యాంగులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు, అలాగే వయోవృద్ధులకు అందుబాటులో ఉన్న జీవన పరిస్థితులు మరియు ఆరోగ్య సంరక్షణ వంటి అంశాలపై కమిటీ ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. శాసన వ్యవహారాల శాఖా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... శాసనమండలి సంయుక్త కమిటీలు అత్యంత ప్రభావితమైనవి. బలహీన వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను మరింత సమర్ధవంతంగా అమలు చేయడానికి ఈ సంయుక్త కమిటీ సూచనలు, సలహాలు ఉపయోగపడుతాయి. క్షేత్ర స్థాయిలోని సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాలతో ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం ద్వారా పరిష్కరించవచ్చు. జనాభాలో సగభాగంగా ఉన్న మహిళల సాధికారత కోసం ఈ కమిటీ ఇచ్చే సలహాలు, సూచనలు ప్రభుత్వానికి ఎంతో ముఖ్యమైనవి. అదేవిధంగా శిశువులు, దివ్యాంగులు, వృద్ధుల రక్షణ, సంరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై కూడా కమిటీ రిపోర్టులు ఎంతో విలువైనవన్నారు. శాసన పరిషత్ సమావేశ మందిరంలో ఈరోజు జరిగిన శాసనమండలి (లెజిస్లేచర్) షెడ్యుల్ తెగల సంక్షేమ కమిటీ, వెనుకబడిన వర్గాల సంక్షేమ కమిటీ మరియు మహిళా, శిశు, వృద్ధుల సంక్షేమ కమిటీల ప్రారంభ సమావేశానికి శాసన పరిషత్ ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసన వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, డిప్యూటీ ఛైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ హాజాచరయ్యారు. వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ పాయం వెంకటేశ్వర్లు, సభ్యులు డాక్టర్ మురళీ నాయక్, రాందాస్ మాలోతు, కోవా లక్ష్మి, అనీల్ జాదవ్, తెల్లం వెంకట్రావు, శ్రీపాల్ రెడ్డి పింగళి బిసి వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, సభ్యులు ఆర్. భూపతి రెడ్డి, చింతా ప్రభాకర్, శ్రీ గణెళిష్, రామారావు పవార్, యల్ రమణ, తీన్మార్ మల్లన్న.లు హాజరయ్యారు. మహిళా, శిశు, దివ్యాంగులు, వృద్ధుల వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ చిట్టెం పర్ణికా రెడ్డి, సభ్యులు మట్టా రాగమయి, కోవా లక్ష్మి, వాణీ దేవి. శాసన పరిషత్ కార్యదర్శి డా. వి నరసింహా చార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతిలు కూడా హాజరయ్యారు. ముందుగా నూతన కమిటీ ఛైర్మన్లకు, సభ్యులకు పుష్ప గుచ్ఛాలతో అభినందనలు తెలిపిన ఛైర్మన్, స్పీకర్ గార్లు మరియు సెక్రటరీలు సమావేశాన్ని ప్రారంభించారు.

# 22ఎ భూములపై సిట్టింగ్ జడ్జితో విచారణ

(మొదటి పేజీ తరువాయి)

ఎందుకు బ్లాక్ చేశారో సమాధానం చెప్పాలని అన్నారు. ప్రజల భూములతో చెలగాటమాడుతున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ముఖ్యమంత్రి తక్షణమే బర్తరఫ్ చేయాలని కోరారు. బాధితుల పక్షాన నిలబడి సెప్టెంబర్ 7న ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తామని, సభను స్తంభింపజేసి అయినా బాధితులకు న్యాయం జరిగేలా పోరాడతామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన తమ్ముడికి మాత్రం వందల కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను కట్టబెడతారని, సామాన్య ప్రజల ఆస్తులను మాత్రం 22ఎలో పెట్టి ఇబ్బందుల పాలు చేస్తారని హరీశ్ రావు విమర్శించారు. చివరికి అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్, సీఎం ఇల్లు కూడా 22ఎ నిషేధిత జాబితాలోనే ఉన్నాయంటే ఈ ప్రభుత్వ పనితీరు ఎంత అధ్వాన్నంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు.

రాష్ట్రంలో ఎక్కడ ప్రభుత్వ భూములున్నా హెచ్‌ఎండీఏ, టీజీఐఐసీ, హౌసింగ్ బోర్డు భూములతో పాటు పిల్లలు ఆడుకునే వెయ్యి గజాల పార్కును కూడా రేవంత్ రెడ్డి అమ్మకానికి పెట్టారని, ఇలా అమ్ముకుంటూ పోతే రేపు బడికి, గుడికి, చివరకు స్మశాన వాటికకు కూడా భూమి మిగలదని ధ్వజమెత్తారు. కమీషన్ల కక్కుర్తి కోసమే సామాన్య ప్రజల ఆస్తులను ప్రభుత్వం నిషేధిత జాబితాలోకి నెట్టిందని బీఆర్ఎస్ డిప్యూటీ ఎలోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్ నగర్ ఎం.జే. గార్డెన్స్‌లో 22ఎ భూముల సమస్యలతో సతమతమవుతున్న బాధిత కుటుంబాల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, గోరేటి వెంకన్న తదితరులతో కలిసి బాధితుల ఆవేదనను స్వయంగా అడిగి తెలుసుకున్న హరీశ్ రావు, బీఆర్ఎస్ పార్టీ పక్షాన వారికి పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై పదునైన విమర్శలు గుప్పించారు. 22ం కుట్ర వెనుక భారీ కమీషన్ల బాగోతం దాగి ఉందన్న ఆయన, ఈ అక్రమాల్లో ఏ-1గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏ-2గా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారని ఆరోపించారు. 50-50 కమీషన్ల కోసమే లక్షలాది మంది ప్రజలను నిద్రలేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. 98 శాతం భూములను 22ం జాబితా నుంచి తొలగించామని మంత్రి పొంగులేటి పచ్చి అబద్దాలు ఆడుతున్నారని, అదే నిజమైతే వందలాది మంది బాధితులు తమ గోడు వెళ్లబోసుకోవడానికి ఇక్కడికి ఎందుకు వస్తారని ప్రశ్నించారు.

# సీజనల్ వ్యాధులపై దృష్టి పెట్టండి

**హైదరాబాద్,ఆగష్టు25:** సీజనల్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలనిఅధికారులకు సీఎస్ సంజయ్ జాజు సూచించారు. వర్షాలు, వరదలు నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే స్పందించేలా జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీజనల్ పరిస్థితులు, ప్రజలకు అవసరమైన సేవలు, నీట్ పీజీ ప్రవేశ పరీక్ష ఏర్పాటు తదితర అంశాలపై కలెక్టర్లతో ఆయన సమీక్షించారు. ఆయా అంశాలపై చేపడుతున్న చర్యలను కలెక్టర్లను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఇక నీట్ పీజీ ప్రవేశ పరీక్ష నిర్వహణకు సంబంధించి జిల్లాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సీఎస్ ప్రత్యేకంగా సమీక్షించారు. పరీక్షా కేంద్రాల వద్ద మౌలిక వసతులు, భద్రత, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా తదితరత అంశాలపై అధికారులతో సమన్వయం చేసుకుని పని చేయాలని సూచించారు. ఈ ప్రవేశపరీక్షను ప్రశాంతంగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లను సీఎస్ సంజయ్ జాజు ఆదేశించారు. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో పంట మార్పిడి విధానాలపై రైతులను మరింత చైతన్యపరిచి వ్యవసాయసాగుకు అనుసరించాల్సిన నూతన విధానాలపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. జిల్లాల వారీగా సీజనల్ పరిస్థితులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకుంటున్న ముందస్తు చర్యలపై సీఎస్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. పంటల వైవిధ్యీకరణ (క్రాప్ డైవర్సిఫికేషన్) అవసరాన్ని చెబుతూ, తక్కువ నీటి అవసరం ఉండే, ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన పంటలను సాగు చేసేలా రైతులకు నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు.

# విద్యార్థుల జీవితాలతో ఆటలొద్దు

(మొదటి పేజీ తరువాయి)

భాజపా చేపట్టిన కార్యక్రమంలో ఈటల పాల్గొని మాట్లాడారు. సీఎం ఒకసారి రాష్ట్రంలోని విద్యార్థుల పరిస్థితి గురించి ఆలోచించాలన్నారు. 20లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును కాపాడే బాధ్యతను భాజపా తీసుకుందని పేర్కొన్నారు. 'నా విద్యార్థులు, నా యువత క్వాలిటీగా ఉండాలి.. ఆరోగ్యవంతులుగా ఉండాలి' అని కలలు కంటున్న నాయకుడు నరేంద్ర మోదీ అని వివరించారు.

పేద తల్లిదండ్రుల పిల్లలు కూడా గొప్పగా చదువుకొని డాక్టర్లు, ఇంజనీర్లు, అడ్వకేట్లు, ఉన్నతాధికారులు కావాలని కలలు కంటున్నారని, అదే నిజమైన తెలంగాణ అభివృద్ధిగా పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం రామచందర్ రావు చేస్తున్న ఈ 48 గంటల దీక్షకు బీజేపీ అండగా ఉందన్నారు.

ఫీజుల బకాయిలు చెల్లించే వరకు.. తెలంగాణ విద్యార్థులకు న్యాయం జరిగే వరకు భాజపా పోరాటం కొనసాగుతుందని తెలిపారు. నిరాహార దీక్ష చేస్తున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అస్వస్థతకు గురయ్యారు. రామచందర్ రావును పరీక్షించిన వైద్యులు.. బీపీ 90/60గా ఉన్నట్లు తెలిపారు.'ఫీజు బకాయి-భాజపా లడాయి' పేరుతో భాజపా నేతలు రెండో రోజు నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. రామచందర్ రావు దీక్షకు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకట రమణారెడ్డి, పాయల్ శంకర్, రామారావు పటేల్ పలువురు భాజపా నేతలు మద్దతు తెలిపారు.

# సీఎం రేవంత్ యూఎస్ పర్యటనపై వివరణ ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

అనుమతులు లేకుండా ఎందుకు విదేశీ పర్యటనకు వెళ్లారంటూ తెలంగాణ సీఎంను ఆయన సూటిగా ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి.. స్థాయికి తగినట్లుగా ఈ పర్యటన లేదని తెలిపారు.ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనపై తాము కొత్తగా నిబంధనలు పెట్టలేదని గుర్తు చేశారు. స్వాతంత్య్రం నుంచి ఉన్న నిబంధనలే తాము అమలు చేశామని స్పష్టం చేశారు.

ఇది సాధారణ పక్రియ.. ఇందులో రాజకీయాలకు తావు లేదన్నారు. భారత్‌పై విషం చిమ్మే వ్యక్తి న్యూయార్క్ మేయర్ మామ్దానీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ కానున్నారంటూ వార్తలు వచ్చాయని వివరించారు. ప్రధాని మోదీని టెర్రరిస్ట్ అని న్యూయార్క్ మేయర్ వ్యాఖ్యనించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

మామ్ధానీను ఎందుకు కలుస్తున్నారో.. సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.గతంలో తన విదేశీ పర్యటనను కూడా కేంద్ర విదేశాంగ శాఖ నిరాకరించిందని కిషన్ రెడ్డి తెలిపారు. మన దేశ ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని విదేశాంగ శాఖ ఈ నిర్ణయం తీసుకుందని అభిప్రాయపడ్డారు.

గుజరాత్ సీఎంకు యూఎస్ పర్యటనకు అనుమతి ఇచ్చి.. తమకు అనుమతి ఇవ్వలేదని సీఎం రేవంత్ వాదించడం వితండవాదమని పేర్కొన్నారు. నరేంద్ర మోదీ సీఎంగా ఉన్నప్పుడు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆయన విదేశీ పర్యటనను నిరాకరించిందని చెప్పారు. అయితే సీఎం రేవంత్ రెడ్డికి హార్వర్డ్ బిజినెస్ కోర్సు చదివేందుకు కేంద్రం అనుమతి ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనలను కూడా గతంలో రద్దు చేసిందని చెప్పారు.

కుల గణన అంశంలో తెలంగాణ ప్రభుత్వం ఫెయిల్యూర్ అయిందని తెలిపారు. హైదరాబాద్‌లో 20 శాతం ఇళ్లలో కులగణన జరగలేదని వివరించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి కుల గణనపై అవగాహన లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు.

# తెలుగు రాష్ట్రాల మధ్య రహదారి అభివృద్ధి

**న్యూఢిల్లీ,ఆగష్టు25 :** తెలుగు రాష్ట్రాలను కలిపే జాతీయ రహదారి 365బీబీ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బుట్టాయగూడెం-ఎల్ఎన్‌డీ పేట, పట్టిసీమ- కొవ్వూరు సెక్షన్ల మధ్య 45.09 కిలోమీటర్లతో రహదారి ఉన్నతీకరణ కోసం రూ. 840.41 కోట్లతో కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్ర రోడ్లు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఎక్స్ వేదికగా వెల్లడించారు. 45 కిలోమీటర్ల 2 లేన్ల జాతీయ రహదారికి ఇరువైపులా రోడ్లు నిర్మించనున్నట్లు గడ్కర్ తెలిపారు. ఈ రహదారి ఉన్నతీకరణతో పోలవరం ప్రాజెక్ట్, పరిసర గ్రామాలకు కనెక్టివిటీ పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాంతం పొగాకు, చెరకు, ఫామాయిల్ తోటలతో నిండి ఉంటుందని.. ఈ హైవే అభివృద్ధితో మౌలిక సదుపాయాలు మెరుగు అవుతాయన్నారు. పంటల రవాణా వేగంగా, సురక్షితంగా జరుగుతుందని చెప్పారు. పంట పొలాల నుంచి మార్కెట్‌కు అనుసంధానం పెరుగుతుందని, స్థానికంగా జీవనోపాధి మెరుగవుతుందని గడ్కరీ పేర్కొన్నారు. అప్‌గ్రేడ్ చేసిన జాతీయ రహదారితో తెలుగు రాష్ట్రాల మధ్య కనెక్టివిటీ పెరగడంతో పాటు, ఇరురాష్ట్రాల ప్రయాణికులకు, పర్యాటకులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నేపథ్యంలో భక్తులు సులభంగా ఘాట్ల వద్దకు చేరుకోవడానికి, పోలవరం ప్రాజెక్ట్ సందర్శించేందుకు వీలవుతుందన్నారు.

# వారిపై చర్యలు ఉంటాయి: మల్లు రవి

(మొదటి పేజీ తరువాయి)

ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌కు పంపారని తెలిపారు. మంగళవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..గత విషయాలను కూడా పరిగణలోకి తీసుకున్నామని వివరించారు. ఈ నివేదికను ఏఐసీసీ చీఫ్, పార్టీ జనరల్ సెక్రటరీకి కూడా పంపిస్తారని అన్నారు. కాంగ్రెస్ హై కమాండ్ ఆదేశాల మేరకు వారిపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.నాయకులు, క్యాడర్‌కు ఒక మెసేజ్ ఇవ్వాలని అనుకుంటున్నామని మల్లు రవి తెలిపారు. పార్టీపై నెగెటివ్ అభిప్రాయాన్ని కలిగించకుండా ఉండాలంటే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిందని అభిప్రాయపడ్డారు.

# త్వరత్వరగా మూసీ భూసేకరణ

(మొదటి పేజీ తరువాయి)

సేకరణ కోసం స్పష్టమైన విధానం తయారు చేసుకోవాలని సూచించారు. న్యాయపరమైన చిక్కులు రాకుండా చూడాలన్నారు. మూసీ ప్రాజెక్టు ఫేజ్ 2కి వీలైనంత త్వరగా టెండర్‌లను పిలవాలని తెలిపారు. ప్రాజెక్ట్‌లకు అతి తక్కువ వడ్డీకి వచ్చే రుణాలపైన మునిసిపల్ కమిషనర్‌లు దృష్టి సారించాలని సీఎం తెలిపారు. టీడీఆర్‌పై ప్రతి వారం సమీక్ష జరగాలని చెప్పారు. మంచిరేవుల ఓంకారేశ్వరస్వామి ఆలయం టెండర్లు తక్షణం పిలవాలని ఆదేశించారు. కొత్వాల్ గూడా బర్డ్స్ పార్క్‌కు మరింత ప్రచారం కల్పించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచనలు చేశారు. త్వరగా పనులు జరిగేలా చూడాలన్నారు. పనుల్లో ఆలస్యం తగదని, నిర్ణీత సమయంలోగా ప్రాజెక్టుల పూర్తికి ముందుకు సాగాలని అన్నారు. హెచ్‌ఆర్‌డి బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ సమీక్షా సమావేశానికి సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, హెచ్ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి, సైబరాబాద్ కమిషనర్ సృజన, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి, ఎంఆర్డీసీఎల్ ఎండీ ఈ.వి. నరసింహ రెడ్డి, ఎంఆర్డీసీఎల్ జేఎండీ గౌతమి, హాజరయ్యారు.

# ఏడాదిలో దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేయడమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

సమీక్షలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రాజెక్టు పనులను ప్రారంభం నుంచి ముగింపు వరకు సమగ్రంగా సమీక్షించి, ఎక్కడ పనులు నిలిచిపోయాయి, అందుకు కారణాలేంటి.. వాటిని పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలేంటి అనే అంశాలను పాయింట్‌వారీగా గుర్తించాలని అధికారులను ఆదేశించారు. సమస్యను గుర్తించకుండా పనులు పూర్తవుతాయి అంటూ కాలయాపన చేయడం సరికాదని, ప్రతి సమస్యకు స్పష్టమైన పరిష్కారం, బాధ్యత, గడువు నిర్ణయించాలని అధికారులకు సూచించారు. భూసేకరణ, అనుమతులు, నిర్మాణ పనులు, నిధులు, కాంట్రాక్టు ఏజెన్సీలకు సంబంధించిన సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం, అధికారులు, ఇంజనీర్లు, ఏజెన్సీలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ప్రాజెక్టుపై పూర్తి అవగాహన ఉన్న అధికారులతో స్టార్టింగ్ నుంచి ఎండింగ్ వరకు సమగ్ర సమీక్ష నిర్వహించి, స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సమస్య ఎక్కడ ఉందో ముందుగా గుర్తించాలి.. కారణాన్ని విశ్లేషించాలి.. పరిష్కారాన్ని ఖరారు చేసి అమలు చేయాలి. ఫలితం వచ్చే వరకు నిరంతరం పర్యవేక్షించాలి. దేవాదుల పూర్తి విషయంలో ఎలాంటి కాలయాపనకు తావులేదుఅని మంత్రి స్పష్టం చేశారు.

# వనమహోత్సవ లక్ష్యాన్ని చేరుకోవాలి



**హైదరాబాద్,ఆగష్టు25 :**రాష్ట్ర వ్యాప్తంగా వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని మంత్రి సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు. మొక్కలు నాటిన విధంగానే.. నాటిన మొక్కల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. ప్రతి మొక్కను సంరక్షిస్తూ వందశాతం మనుగడ సాధించాలని చెప్పారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీటిని అందించాలని సూచించారు. వన మహోత్సవం లక్ష్యాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో గ్రామీణ అభివృద్ధి శాఖపై మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో కమిషనర్ దివ్య, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, జిల్లా సీఈవోలు, డీఆర్డీవోలు, డీపీవో, అడిషనల్ డీఆర్డీవోలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి సీతక్క దిశానిర్దేశంచేశారు. ఉపాధి హామీ పనులు, పంట కుంటల నిర్మాణం, మహిళా సంఘ భవనాల నిర్మాణం, నూతన చేయూత పెన్షన్ల మంజూరుపై సమీక్షించారు. ఇప్పటివరకు 86శాతం మొక్కలు నాటామని తెలిపారు. 6.18 కోట్ల మొక్కలు నాటి లక్ష్యాన్ని నిర్దేశిరచుకుని 5.32 కోట్ల మొక్కలను నాటినట్లు వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలు, విద్యార్థులు, యువతను భాగస్వాములను చేయాలని దిశానిర్దేశర చేశారు. మొక్కలకు రక్షణ కంచెలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని తెలిపారు. అవెన్యూ ప్లాంటేషన్లలో ఫెన్సింగ్ పటిష్ఠంగా ఉండేలా చూడాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో రోజుకు కనీసం 60 మంది కూలీలకు ఉపాధి కల్పించాలని తెలిపారు. పనికి సిద్ధంగా ఉన్న ప్రతి కూలీకి పని అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క ఆదేశించారు. కూలీలకు వారి నివాస ప్రాంతానికి సమీపంలోనే ఉపాధి కల్పించాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో తగినంత పనుల షెల్ఫ్ సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఔఓఓ÷ూ హాజరును ప్రతిరోజూ పర్యవేక్షించాలని మార్గనిర్దేశర చేశారు. కూలీల సమీకరణ బాధ్యతను క్షేత్రస్థాయి సిబ్బందికి స్పష్టంగా అప్పగించాలని నిర్దేశిరచారు. మంజూరైన అన్ని ఫార్మ్ పాండ్ల పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఉపాధితో పాటు నీటి సంరక్షణకు శాశ్వత ఆస్తులుగా అభివృద్ధి చేయాలని మంత్రి సీతక్క సూచించారు. తక్కువ పనితీరు ఉన్న జిల్లాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశిరచి నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఉపాధి పనులతో పాటు నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ఆదివాసి గిరిజన ఏజెన్సీ ప్రాంతాల్లో చెక్ డ్యాముల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని నిర్దేశిరచారు. ఫార్మ్ పాండ్లు, ఇతర నీటి సంరక్షణ పనులను వేగంగా ప్రారంభించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, నీటి సంరక్షణ, జీవనోపాధి ఆస్తుల సృష్టి ఏకకాలంలో జరగాలని చెప్పారు. ప్రభుత్వ లక్ష్యాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు.

RNI - TELTEL/2023/87644

## సాంస్కృతిక కళావేదిక నిర్మించిన దాతకు ఘన సన్మానం



**ఖానాపూర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిగ్వా వద్ద విద్యార్థుల కోసం సాంస్కృతిక కళావేదిక నిర్మించిన దాత కులకర్ణి ప్రజోత్‌కుమార్‌కు మంగళవారం సన్మానం చేశారు. ఆయన రూ.1.50 లక్షలు వెచ్చించి కళావేదిక నిర్మించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ మేం. రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్. విజయ్ కుమార్, కుబీర్ పోలీస్ స్టేషన్ సబ్‌ఇన్స్పెక్టర్ కృష్ణారెడ్డి, ఎస్టీయూటీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాంపల్లి నాగభూషణ్, ఏకలవ్య ఫౌండేషన్ చైర్మన్ మహేష్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వరూపరాణి చేతుల మీదుగా కళావేదిక ప్రారంభించారు.దివ్యాంగ ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో నరసింహచారి, రాథోడ్ సురేష్, తుల శ్రీనివాస్, శ్రీమతి ముత్తవ్వ, రామలింగం, విద్యార్థులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



**ఖానాపూర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఖానాపూర్ మండలంలోని రంగపేట గ్రామంలో మంగళవారం వనమహోత్సవం నిర్వహించారు .ఈ సందర్భంగా ఎంపీడీవో రాధా రాథోడ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. గ్రామంలో విస్తృతంగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.

## ఆయిల్‌ఫామ్ కాంపౌండ్లను పరిశీలించిన ఎంపీడీవో



**ఖానాపూర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఖానాపూర్ మండలంలోని సత్తనపల్లి, భీర్నంది గ్రామాల్లో రైతులు నిర్మిస్తున్న ఆయిల్‌ఫామ్ కాంపౌండ్లను ఎంపీడీవో రాధా రాథోడ్ పరిశీలించారు.భీర్నందికి చెందిన రైతు ములసపు రాజన్న ఏర్పాటు చేస్తున్న కాంపౌండ్‌ను పరిశీలించిన ఆమె, గతంలో విజయ ద్వారా ఆయిల్‌ఫామ్ మొక్కలు అందజేశామని, ప్రస్తుతం వాటిని సాగు చేసేందుకు కాంపౌండ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఆయిల్‌ఫామ్ సాగుతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందని ఎంపీడీవో రాధా రాథోడ్ పేర్కొన్నారు.

## జడ్పీహెచ్‌ఎస్‌లో మొక్కలు నాటిన డీఎంహెచ్‌ఓ



**ఖానాపూర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఖానాపూర్ మండలంలోని భీర్‌నంది జడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం మొక్కల నాటే కార్యక్రమం జరిగింది.నిర్మల్ జిల్లా డీఎంహెచ్‌ఓ రాజేందర్, సర్పంచ్ నవీన్ యాదవ్, ఉపసర్పంచ్ ఆర్. రాకేష్, వార్డు సభ్యులు, ప్రధానోపాధ్యాయుడు జీఎల్‌వీ ప్రసాద్, పీఎస్ హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతో అవసరమని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు. పర్యావరణ సమతుల్యత సాధించాలంటే మొక్కలను కాపాడాల్సిన అవసరం ఉందని, అటవీ సంరక్షణ మన సంరక్షణ అని పేర్కొన్నారు.

## పీహెచ్‌సీ భవనం నిర్మాణానికి స్థల సేకరణపై సమావేశం



**ఖానాపూర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఖానాపూర్ మండలంలోని బీర్‌నంది గ్రామానికి పిహెచ్సి భవనం మంజూరైంది. ఈ సందర్భంగా మంగళవారం జెడ్పీఎస్ఎస్ బీర్‌నంది పాఠశాలలో సమావేశం జరిగింది.స్థల సేకరణపై చర్చించిన ఈ సమావేశంలో డీఎంహెచ్వో డాక్టర్ రాజేందర్, ఎంపీడీవో రాధా రాథోడ్, సర్పంచ్ నవీన్ యాదవ్, ఉపసర్పంచ్ రాకేష్, హై స్కూల్ హెడ్‌మాస్టర్ జి.ఎల్.వి. ప్రసాద్, ప్రైమరీ స్కూల్ హెడ్‌మాస్టర్ శ్రీదేవి, పంచాయతీ సెక్ర టరీ దేవేందర్, వార్డు సభ్యులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గ్రామంలో ఆరోగ్య సదుపాయాల అభివృద్ధికి ఈ పిహెచ్సి భవనం కీలకంగా నిలుస్తుందని అధికారులు పేర్కొన్నారు.

## ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన మున్సిపల్ చైర్మన్



**ఖానాపూర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఖానాపూర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక మహేందర్ సందర్శించారు.గత ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు పాఠశాలలో ఫర్నిచర్, ఫ్యాన్లను ధ్వంసం చేసిన ఘటనపై ఇంచార్జి ప్రధానోపాధ్యాయుల నుంచి వివరాలు తెలుసుకుని పాఠశాల అంతట పరిశీలించారు.ఈ సందర్భంగా విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలని, గురువులను, తల్లిదండ్రులను గౌరవించాలని సూచించారు. పాఠశాలలో జరిగిన ధ్వంసకాండపై పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బొప్పారపు సత్యవతి, బిజెపి నాయకులు ఎనగందుల నారాయణ, ప్రకాష్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు ఐఆర్‌సిటిసి కాశివేణి ప్రణయ్, ఆసం ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# సర్వాయిపేట నుంచి ఆకునూరు వరకు అభివృద్ధి పర్యటన చేసిన మంత్రి పొన్నం



**హుస్నాబాద్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** సైదాపూర్ మండలంలోని సర్వాయిపేట, పెర్కపల్లి, గొల్లగూడెం, ఆకునూరు గ్రామాల్లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పల్లె పల్లెకు ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా పర్యటించారు.సర్వాయిపేటలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి, పశువైద్య శిబిరాన్ని ప్రారంభించారు. పాపన్న గౌడ్ కోట మరమ్మతులు, రూ.4.5 కోట్లతో పర్యాటక ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.పెర్కపల్లిలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి, స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. రూ.11.5 కోట్లతో రహదారి పనులు, రూ.3.47 కోట్లతో వంతెన పనులు చేపట్టినట్లు తెలిపారు. తాగునీరు, అంగన్‌వాడీ, వైద్య సేవల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.గొల్లగూడెంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసి, పంచాయతీ భవనం, తాగునీరు, రోడ్లు, అంగన్‌వాడీ, వాటర్ ప్లాంట్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆకునూరులో సాగు, తాగునీటి సమస్యల పరిష్కారానికి కొత్త చెరువు ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సర్వాయిపేట--ఆకునూరు మీదుగా వెంకటేశ్వరపల్లి వరకు రహదారి పనులు పూర్తి చేస్తామని చెప్పారు.మంత్రి మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడమే కార్యక్రమం ఉద్దేశమని, సంక్షేమం--అభివృద్ధికి ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని, వర్షపు నీటిని నిల్వచేసి భూగర్భ జలాలను పెంచుకోవాలని సూచించారు.బీసీల సామాజిక న్యాయం, విద్యార్థుల భవిష్యత్తు, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమాల్లో జిల్లా, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళా సంఘాలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించిన కలెక్టర్



**సిద్దిపేట, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** సిద్దిపేట రూరల్ మండలం చిన్నగుండవెల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు.ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు అందిస్తున్న అన్నం, కూర, పప్పుచారును స్వయంగా రుచి చూశారు. భోజనం నాణ్యత బాగుందని అభినందిస్తూ, పిల్లలకు స్వయంగా అన్నం వడ్డించారు. విద్యార్థులు శుభ్రంగా భోజనం చేసేలా ఉపాధ్యాయులు సహాయం చేయాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి వాతావరణం బాగుందని అభినందించారు. విద్యార్థులకు చదవడం, రాయడం పటిష్టంగా నేర్పించి పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించిన కలెక్టర్ కామన్ డైట్ మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు అందించిన రసం, పప్పు నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ మెరుగుపరచాలని సూచించారు. కామన్ డైట్ మెనూ ప్రకారం భోజనం అందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసి సంబంధిత ప్రధానోపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారిని ఆదేశించారు.హాజరు రిజిస్టర్, టీచర్స్ డైరీలను తనిఖీ చేసిన కలెక్టర్ కొంతమంది ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహిస్తున్నారని గుర్తించి హెచ్చరించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామర్థ్యాలు పెంపొందేలా బోధన అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.ప్లే స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఆట వస్తువులను కూడా పరిశీలించి పిల్లలు సురక్షితంగా ఆడుకునేలా ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

## నీట్ పీజీ పరీక్ష, రోడ్డు భద్రతపై కలెక్టర్ సమీక్ష సమావేశం




**కరీంనగర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఈనెల 30న జరగనున్న నీట్ పీజీ పరీక్షను ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ కరీంనగర్‌లో ఏడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసి 1505 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు.పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, వైద్య బృందం, పోలీస్ సిబ్బంది వంటి అన్ని సౌకర్యాలు ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష కావడంతో విద్యుత్ అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.అదే రోజు రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశంలో కలెక్టర్ ప్రజల భద్రత విషయంలో రాజీ పడొద్దని హెచ్చరించారు. ప్రమాదకర ప్రదేశాలను గుర్తించి తరచుగా తనిఖీలు చేయాలని, రోడ్ సైడ్ ఫ్లెక్సీలు, హోర్డింగులపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సూచించారు. హిట్ అండ్ రన్ కేసుల బాధితులకు వెంటనే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. సీపీ గౌస్ ఆలం రోడ్డు ప్రమాదాలు, హిట్ అండ్ రన్ కేసులపై వివరించారు.ఈ సమావేశాల్లో రవాణా, పోలీస్, వైద్య, మున్సిపల్, అగ్నిమాపక, ఆర్‌అండ్‌బీ, ఎన్‌హెచ్‌ఏఐ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



**కరీంనగర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు.జిల్లా కలెక్టరేట్ ముందు జరుగుతున్న రిలే నిరాహార దీక్షలకు మద్దతు ప్రకటించిన ఆయన మాట్లాడుతూ పల్లెల్లో పరిశుభ్రతను కాపాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని రక్షిస్తున్న కార్మికులు తక్కువ వేతనాలతో వెట్టిచాకిరి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కార్మికులను పర్మినెంట్ చేయాలని, రెండవ పిఆర్సి పరిధిలోకి తీసుకుని కనీస వేతనం రూ.26 వేలుగా అమలు చేయాలని కోరారు. జీవో నెంబర్ 51 సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి కారోబార్, బిల్ కలెక్టర్లకు ప్రత్యేక హోదా కల్పించాలని సూచించారు.గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు నేరుగా అకౌంట్లలో జమ చేయాలని, మరణించిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించాలని, అంత్యక్రియల ఖర్చు రూ.30 వేలుగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికుల్లో ఎక్కువ శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలే ఉన్నారని, వీరి పట్ల ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం శోచనీయమని వాసుదేవరెడ్డి పేర్కొన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ



**పెద్దపల్లి, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ముస్లిం మైనారిటీల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ (టీజీఎంఎఫ్‌సీ) చైర్మన్ మహమ్మద్ ఒబైదుల్లా కోత్వాల్ తెలిపారు.పెద్దపల్లి ఎంబీ గార్డెన్స్‌లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావుతో కలిసి 600 మంది మైనారిటీ మహిళలకు రూ.72 లక్షల విలువైన కుట్టు మిషన్లు, 60 మంది కాశ ముస్లిం లబ్ధిదారులకు రూ.36 లక్షల సబ్సిడీతో రాతి కటింగ్ యంత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కోత్వాల్ మాట్లాడుతూ మైనారిటీ మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలని, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. మహిళలు ఇంటి వద్దే కుట్టు పనులు చేసి ఆదాయం పొందేలా ప్రభుత్వం సబ్సిడీతో మిషన్లు అందజేస్తోందని పేర్కొన్నారు.ప్రభుత్వ విప్ విజయరమణ రావు మాట్లాడుతూ గతంలో పెద్దపల్లిలో కేవలం 200 మిషన్లు మాత్రమే పంపిణీ చేయగా, ప్రజా ప్రభుత్వం ఒక్కరోజులోనే 600 మిషన్లు అందజేస్తోందని తెలిపారు. కాశ ముస్లిం వర్గాలకు 60 రాతి కటింగ్ యంత్రాలు పంపిణీ చేశామని, మైనారిటీల శ్మశానవాటికల కోసం భూములు కేటాయించామని, షాదీఖానా నిర్మాణానికి స్థలం కేటాయించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి పి. నరేష్ కుమార్ నాయుడు, ప్రజాప్రతినిధులు, మైనారిటీ మహిళలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఘనంగా బీసీ రిజర్వేషన్ల పితామహుడు బిందేశ్వరి ప్రసాద్ మండల్ జయంతి వేడుకలు



**నంద్యాల, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** బీసీ రిజర్వేషన్ల పితామహుడు బిందేశ్వరి ప్రసాద్ మండల్ 108వ జయంతి సందర్భంగా నంద్యాల జిల్లా ఆర్‌పీఎస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.1918 ఆగస్టు 25న జన్మించిన బీపీ మండల్, వెనుకబడిన వర్గాల సామాజిక న్యాయం కోసం మండల్ కమిషన్‌కు అధ్యక్షత వహించి విశేష కృషి చేశారు. 1980లో సమర్పించిన కమిషన్ నివేదికలో ఓబీసీలను సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలుగా గుర్తించి, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 27% రిజర్వేషన్ కల్పించేందుకు మార్గం సుగమం చేశారు.ఆయన ఆశయాలను కొనసాగిస్తూ రిజర్వేషన్ల పరిరక్షణ సమితి నాయకులు బహుజన వర్గాల న్యాయం కోసం ఏకమై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ పెరుగు శివకృష్ణ యాదవ్, ఆర్‌పీఎస్ యువజన విభాగం అధ్యక్షుడు బిజినవేముల శ్రీనివాసులు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమ్మరి ప్రసాద్, న్యాయవాదులు జగదీష్, ఖాదర్, ఆర్‌పీఎస్ నాయకులు మనోహర్, ఇర్ఫాన్, హేమచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీలో ముగిసిన అన్న అక్క మెంటార్షిప్ శిక్షణ




**గంగాధర, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని కేజీబీవీ పాఠశాలలో అన్న అక్క మెంటార్షిప్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఏఐ, డిజిటల్ లెర్నింగ్ శిక్షణ తరగతులు ఘనంగా ముగిశాయి. ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ అటానమస్ కళాశాలకు చెందిన బీకాం, బీబీఏ ఐదవ సెమిస్టర్ విద్యార్థులు, బీకాం ఆర్వో మూడవ సెమిస్టర్ విద్యార్థులు 15 రోజులలో 30 గంటలపాటు పాఠశాల విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్, కోడింగ్, పైతాన్, కంప్యూటేషనల్ థింకింగ్, ఆర్డీనో బోర్డు ప్రయోగం వంటి అంశాలపై శిక్షణ అందించారు.కళాశాల ప్రిన్సిపల్ కల్వకుంట రామకృష్ణ, జిల్లా నోడల్ అధికారి మధు రాజేష్, కామర్స్ విభాగ నోడల్ అధికారి మల్లారెడ్డి విద్యార్థుల బృందాన్ని అభినందించారు. కేజీబీవీ ప్రత్యేక అధికారి పూర్ణిమ గౌతమి మాట్లాడుతూ డిగ్రీ విద్యార్థులు పాఠశాల విద్యార్థులకు ఏఐ, డిజిటల్ లెర్నింగ్ శిక్షణ ఇవ్వడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భూముల రీ-సర్వేను పారదర్శకంగా పూర్తి చేయాలి కలెక్టర్ కె. హైమావతి



**సిద్దిపేట, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జిల్లాలో జరుగుతున్న భూముల పునఃసర్వే ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఇర్కోడ్ గ్రామంలో ప్రభుత్వ భూముల పునఃసర్వే పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రతి లైసెన్స్‌డ్ సర్వేయర్ ప్రణాళికాబద్ధంగా పనిచేసి నాణ్యతతో పాటు వేగాన్ని పాటించాలని సూచించారు.భూముల రికార్డులు, సరిహద్దులు, విస్తీర్ణాన్ని ఆధునిక సర్వే పద్ధతులతో కొలిచి రికార్డులతో సరిపోల్చే విధంగా పునఃసర్వే జరగాలని కలెక్టర్ ఆదేశించారు.కార్యక్రమంలో సర్వే, భూముల శాఖ ఏడీ సుదర్శన్, మండల అధికారులు పాల్గొన్నారు.

## రైతులకు స్థిరమైన విద్యుత్ సరఫరాకు కెపాసిటర్ బ్యాంకులు ఏర్పాటు



**కరీంనగర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** వ్యవసాయ ఆధారిత ప్రాంతాల్లో మోటర్ల వల్ల ఏర్పడే రియాక్టివ్ పవర్ డిమాండ్‌ను నియంత్రించేందుకు 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో కెపాసిటర్ బ్యాంకులను ఏర్పాటు చేసినట్లు కరీంనగర్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆర్. రవీందర్ తెలిపారు.గత రెండున్నర సంవత్సరాల్లో 2 ఎంవిఏఆర్ సామర్థ్యం గల 90 కెపాసిటర్ బ్యాంకులు, 1 ఎంవిఏఆర్ సామర్థ్యం గల 19 కెపాసిటర్ బ్యాంకులు సబ్‌స్టేషన్లలో, 11 కేవీ ఫీడర్ల వద్ద 23 కెపాసిటర్ బ్యాంకులు ఏర్పాటు చేసినట్లు వివరించారు.గ్రామీణ ఫీడర్లలో ఇండక్షన్ లోడ్ అధికంగా ఉండటం వల్ల పవర్ ఫ్యాక్టర్ తగ్గుతుందని, కెపాసిటర్ బ్యాంకుల ద్వారా వోల్టేజ్ ప్రొఫైల్ మెరుగుపడుతోందని చెప్పారు. దీంతో రైతాంగానికి నాణ్యమైన, స్థిరమైన విద్యుత్ సరఫరా అందుతోందని, సాంకేతిక నష్టాలు తగ్గుతున్నాయని తెలిపారు.అదనపు పవర్ ట్రాన్స్ఫార్మర్ల అవసరాన్ని తగ్గించడంతో పాటు ఫీడర్ చివరి ప్రాంతాల్లో కూడా వోల్టేజ్ స్థిరంగా అందుతోందని, ముఖ్యంగా వ్యవసాయ పంపుసెట్లకు మెరుగైన విద్యుత్ సరఫరా జరుగుతోందని ఎస్ఈ పేర్కొన్నారు.

## దేశంలోని కోటి కుటుంబాలకు సౌర విద్యుత్ లక్ష్యం



**కరీంనగర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా 2027 మార్చి నాటికి దేశంలోని కోటి కుటుంబాలకు సౌర విద్యుత్ అందించడమే లక్ష్యమని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు.మంగళవారం కరీంనగర్‌లో మారుతి ఏజెన్సీస్ ఆధ్వర్యంలో పథక పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ పథకం ప్రపంచంలోనే అతిపెద్ద రూఫ్‌టాప్ సోలార్ స్కీమ్‌గా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.ప్రతి కుటుంబానికి సగటున రూ.77,800 వరకు సహాయం అందుతుందని, ఒక కిలోవాట్‌కు రూ.30,000, రెండు కిలోవాట్లకు రూ.60,000, మూడు కిలోవాట్లకు రూ.78,000 సబ్సిడీ లభిస్తుందని వివరించారు.ఈ పథకం ద్వారా గృహ అవసరాలకు విద్యుత్ వినియోగించుకోవడంతో పాటు మిగిలిన విద్యుత్‌ను డిస్కంలకు విక్రయించి ఆదాయం పొందవచ్చని తెలిపారు. పథకాన్ని విస్తృతంగా ప్రజలకు చేరవేయాలని మారుతి ఏజెన్సీస్ నిర్వాహకులను కోరారు. కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, మారుతి ఏజెన్సీస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని బీజేపీ డిమాండ్




**సుల్తానాబాద్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.'ఫీజు బకాయి.. బీజేపీ లడాయి' కార్యక్రమంలో భాగంగా సుల్తానాబాద్ వైశ్యభవన్‌లో జిల్లా స్థాయి పత్రికా సమావేశం జరిగింది. మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని విమర్శించారు. సుమారు రూ.15 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలలు విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని, దీంతో వేలాది మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని, ప్రభుత్వం స్పందించకపోతే మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్యకర్తల సమన్వయంతో పార్టీని బలోపేతం చేయాలి మహేష్‌కుమార్ గౌడ్



**సుల్తానాబాద్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** హైదరాబాద్ గాంధీభవన్‌లో పెద్దపల్లి జిల్లా అభివృద్ధి పథకాలు, మండల--పట్టణ కాంగ్రెస్ కమిటీల అంశాలపై అవగాహన సమావేశం జరిగింది.ఏఐసీసీ కార్యదర్శి సచ్‌దేవ్ ఆధ్వర్యంలో, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు, రామగుండం ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పాల్గొన్నారు. ఈ సమావేశానికి సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ బిరుదు రాధాకృష్ణ హాజరయ్యారు. జిల్లాలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం వంటి అంశాలపై చర్చించారు.మండల, పట్టణ స్థాయిలో కమిటీల పనితీరు, కార్యకర్తల సమన్వయం, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధానంపై నాయకులకు అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మహిళా డిగ్రీ కళాశాలలో ముగిసిన డ్రోన్ టెక్నాలజీ కార్యశాల



**కరీంనగర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో, శాతవాహన విశ్వవిద్యాలయ సౌజన్యంతో నిర్వహించిన డ్రోన్ టెక్నాలజీపై రెండు రోజుల కార్యశాల ముగిసింది.రెండవ రోజు రిసోర్స్ పర్సన్ స్క్వాడ్రన్ లీడర్ గగన్ జోత్ సింగ్ విద్యార్థినులకు డ్రోన్ల అసెంబ్లీ, ఫ్లయింగ్ పద్ధతులు, వివిధ రంగాల్లో వినియోగంపై శిక్షణ ఇచ్చారు.ముగింపు కార్యక్రమానికి శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ సతీష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ఇటువంటి శిక్షణలు విద్యార్థినులలో ఆసక్తి పెంచుతా యని, కొత్త విషయాలు నేర్చుకునే అవకాశం కల్పిస్తాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వరలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ అఫ్సరీ ఉస్మాని, విశ్వవిద్యాలయ ఆచార్యులు రమాకాంత్, సురేష్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎదుట పంచాయతీ కార్మికుల ఆందోళన




**కరీంనగర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** గ్రామపంచాయతీ కార్మికుల 48 గంటల దీక్షలో భాగంగా మంగళవారం కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించి అనంతరం కలెక్టర్ కార్యాల యంలో మెమోరండం సమర్పించారు.ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల శంకర్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు జీతాలు పెంచాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు నేరుగా అకౌంట్లలో జమ చేయాలని డిమాండ్ చేశారు. గత ఎనిమిది సంవత్సరాలుగా జీతాలు పెరగకపోవడం, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు ఇవ్వకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలని, విధి నిర్వహణలో ప్రమాదంతో మరణించిన వారికి రూ.20 లక్షల బీమా ఇవ్వాలని, కనీస వేతనం రూ.26 వేలుగా చెల్లించాలని కోరారు. సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారుల వేధింపులు అరికట్టాలని, సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో కమిటీ సభ్యులు కాష్పాక శంకర్, గంధసిరి సంపత్, మేక మల్ల రాము, గాజర్ల రాజు, ఆకునూరి సుధాకర్, మల్లమ్మ, మణెమ్మ, ఉమా, శ్రీకాంత్, భీక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్



**కరీంనగర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ జిల్లా పబ్లిక్ ఓ ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కోతి రాంపూర్ సీఐటీయూ కార్యాలయంలో ఆటో డ్రైవర్ల సమావేశం జరిగింది.జిల్లా కార్యదర్శి చెలికాని శ్రీనివాస్ మాట్లాడుతూ ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ప్రమాద భీమా, ఆరోగ్య భీమా, పిల్లలకు స్కాలర్‌షిప్‌లు, పెన్షన్ వంటి సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. మహాలక్ష్మి స్కీమ్‌లో భాగంగా ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి 12 వేల రూపాయల జీవన భృతి ఇవ్వాలన్న హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. డీజిల్, పెట్రోల్, విడిభాగాల ధరలు పెరగడంతో ఆటో కార్మికుల జీవనం కష్టమైందని, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 2019 మోటార్ వాహన చట్టం కార్మికులకు భారమైందని విమర్శించారు. ఎలక్ట్రానిక్ ఆటోలు, యాప్ ఆధారిత సేవలు ఆటో రంగాన్ని దెబ్బతీస్తున్నాయని, వాటిని నిషేధించాలని కోరారు.ఈ సందర్భంగా గణేష్ నగర్ ఆటో అడ్డా నెంబర్ వన్ యూనియన్ ఎన్నికలు జరిగి ఎ. వెంకటేష్ అధ్యక్షుడిగా, యం. శివ కార్యదర్శిగా, ఎ. నాగరాజు కోశాధికారిగా ఎన్నికయ్యారు. ఇతర పదవులకు నాయకులను ఎన్నుకున్నారు.కార్యక్రమంలో ఆటో కార్మికులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## పిహెచ్సీని ఆకస్మిక తనిఖీ చేసిన వొడితల ప్రణవ్



**జమ్మికుంట, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జమ్మికుంట మండలంలోని వావిలాల పిహెచ్సీని హుజురాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆసుపత్రి చుట్టూ తిరిగి పేదలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రి నిర్వహణలో నిర్లక్ష్యం కనిపించడంతో సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు వైద్యం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వావిలాల సర్పంచ్ అర్జున్, మండల అధ్యక్షుడు పరశురామారావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## వనమహోత్సవంలో మొక్కలు నాటిన రూరల్ పోలీసులు



**కరీంనగర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కరీంనగర్ రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. దుర్శేడు గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది కలిసి 100 మొక్కలు నాటారు. కార్యక్రమంలో సుమారు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు.అదేవిధంగా చెల్లబూత్కూర్ గ్రామ చెరువు కట్టపై 100 ఈత, తాటి చెట్లను నాటారు. గ్రామ ప్రజలు, గౌడ కులస్తులు, సర్పంచ్, విద్యార్థులు కలిసి పాల్గొన్నారు.ఈ కార్యక్రమాల్లో కరీంనగర్ రూరల్ ఇన్స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి, రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## లోవోల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం ఎమ్మెల్యే కవ్వంపల్లి



**తిమ్మాపూర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం గ్రామంలో రూ.4.60 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపకేంద్రాల ఏర్పాటుతో లోవోల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. రైతులు వ్యవసాయ మోటార్లు నడపడంలో, గృహ వినియోగదారులు విద్యుత్ పరికరాలు వినియోగించడంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగిపోతాయని చెప్పారు.ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తోందని, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.కార్యక్రమంలో ఎంపీడీవో రాజీవ్ మల్హోత్ర, విద్యుత్ శాఖ ఇంజినీర్లు రవీందర్, తిరుపతి, నరేందర్, లక్ష్మీపతిరాజు, ఖాసీం, ప్యాక్స్ చైర్మన్ రమణారెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ చెన్నబోయిన రవి, పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## స్మార్ట్ కార్డులతో పారదర్శకంగా సరుకుల పంపిణీ



**గన్నేరువరం, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** చౌకదుకాణాల ద్వారా సరుకుల పంపిణీలో పారదర్శకత కోసం ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను ప్రవేశపెట్టిందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. మంగళవారం గన్నేరువరం మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర గార్డెన్స్‌లో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ కార్డుల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు మరింత పారదర్శకంగా, సులభంగా సరుకుల పంపిణీ జరుగుతుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, రేషన్ కార్డులు లేని అర్హులైన కుటుంబాలు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పేద ప్రజలకు ఆహార భద్రత కల్పించడంతో పాటు వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరేందర్, సర్పంచ్ లక్ష్మినర్సు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రఘు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొడ్డు సునిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముస్కు ఉపేందర్ రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కటుకం తిరుపతి, పార్టీ నాయకులు, సర్పంచులు, గ్రామశాఖ అధ్యక్షులు పాల్గొన్నారు.

## సి.పి.ఎస్ పాఠశాలలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహణ




**హుస్నాబాద్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** హుస్నాబాద్ పట్టణంలోని 11వ వార్డు సి.పి.ఎస్ పాఠశాలలో సఫాయి అప్నా భీమారీ భగావో కార్యక్రమం పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వార్డు కౌన్సిలర్ వరప్రసాద్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజలకు వ్యక్తిగత శుభ్రత పాటించాలని, నిల్వ నీటిని తొలగించి డయేరియా, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల పరిసరాల్లో రైన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్స్ ఏర్పాటు చేయాలని, చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో కౌన్సిలర్ పూదరి వరప్రసాద్, ఎస్ఐ బాల ఎల్లం, జవాన్ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## వనమహోత్సవంలో పచ్చదనానికి శ్రీకారం



**తిమ్మాపూర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** తిమ్మాపూర్ మండలం రేణికుంట జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో వనమహోత్సవం నిర్వహిం చారు. సర్పంచ్ ఎలుక అంజనేయులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మొక్కలు నాటడం అంటే కేవలం పచ్చ దనం పెంచడం మాత్రమే కాదు, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించే బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించి సంరక్షించాలని సూచించారు. గ్రామ ప్రజలు, యువత, విద్యార్థులు పచ్చదనం పెంపొందించడంలో భాగస్వా ములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ల్యాగల దేవేందర్ రెడ్డి, వార్డు సభ్యులు, మాజీ సభ్యులు, మహిళా సంఘాలు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలపై కేసు నమోదు

**గన్నేరువరం, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మానకొండూరు నియోజకవర్గ ఎమ్మెల్యేపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన ఇద్దరిపై కేసు నమోదైంది.జంగపల్లి గ్రామానికి చెందిన తాడూరు వంశీకృష్ణ రెడ్డి, ముదిగంటి మహేందర్ రెడ్డి వర్గాల మధ్య విద్వేషాలు రేకెత్తించేలా వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. వాట్సాప్ గ్రూప్ అడ్మిన్లపై కూడా కేసు నమోదు చేసినట్లు గన్నేరువరం ఎస్ఐ తెలిపారు.కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బొడ్డు సునీల్ పిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

RNI - TELTEL/2023/87644

## పచ్చదనంతో పాటు సాంకేతిక విద్యకు ప్రోత్సాహం



గంగాధర, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని ఆచంపల్లి గ్రామంలో మంగళవారం వనమహోత్సవం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఆరే తేజశ్రీ రాజశేఖర్ ఆధ్వర్యంలో కెనాల్ వద్ద, పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్.ఆర్.ఆర్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ బి. వెంకటేశ్వర్లు స్కూల్ విద్యార్థులకు ఏఐ శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జక్కుల అనూష శ్రీనివాస్, సెక్రటరీ స్వప్న, వార్డు సభ్యులు, హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, అంగన్వాడి టీచర్ లలిత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## గణిత విజ్ఞాన మేళాలో శ్రీ సరస్వతీ శిశు మందిర్ విద్యార్థుల విజయం



హుస్నాబాద్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : విభాగ్ స్థాయిలో నిర్వహించిన గణిత విజ్ఞాన మేళాలో శ్రీ సరస్వతీ శిశు మందిర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. విద్యార్థులు గణిత శాస్త్రంపై ఆసక్తి, సృజనాత్మక ఆలోచన, విషయ పరిజ్ఞానాన్ని వినూత్న రీతిలో ప్రదర్శించి న్యాయ నిర్ణేతల ప్రశంసలు అందుకున్నారు. పిన్నోజు సాత్విక్ చారి విజ్ఞాన శాస్త్ర విభాగంలో ద్వితీయ బహుమతి సాధించి పాఠశాలకు మరో ఘనతను తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ప్రధానాచార్యురాలు పాలారం శ్రీలత మాట్లాడుతూ విద్యార్థుల విజయం కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు పున్న సోనీ, దొంగల సహస్రల మార్గదర్శకత్వం విద్యార్థుల విజయానికి తోడ్పడిందని తెలిపారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విజేతలకు అభినందనలు తెలియజేసి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## విద్యా పర్యటనలో భాగంగా అగ్నిమాపక కేంద్రం సందర్శన



కరీంనగర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ట్రినిటీ -- ది స్కూల్ ఆఫ్ లెర్నింగ్, సాలేహ్ నగర్ విద్యార్థులు మంగళవారం విద్యా పర్యటనలో భాగంగా అగ్నిమాపక కేంద్రాన్ని సందర్శించారు. నర్సరీ నుంచి 3వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ రోడ్డులోని అగ్నిమాపక కేంద్రాన్ని సందర్శించి అగ్ని ప్రమాదాల సమయంలో పాటించాల్సిన భద్రతా చర్యలు, అత్యవసర విధానాలు, రక్షణ పరికరాల వినియోగంపై అవగాహన పొందారు. ఫైర్ ఆఫీసర్లు, రెస్క్యూ బృందం విద్యార్థులకు అగ్నిమాపక వాహనాలు, పరికరాలు చూపించి భద్రతా నియమాలు వివరించారు. ఈ ప్రత్యక్ష అనుభవం ద్వారా విద్యార్థుల్లో భద్రతా చైతన్యం పెరిగిందని పాఠశాల యాజమాన్యం తెలిపింది. కార్యక్రమంలో చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ డా. దాసరి మమతా రెడ్డి, ప్రిన్సిపాల్ రత్నమాల బెహరా పాల్గొన్నారు.

## యూరియా కొరతపై వ్యవసాయ అధికారికి బీఆర్ఎస్ వినతి



హుస్నాబాద్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : రైతులకు యూరియా కొరత లేకుండా అందించాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు డివిజనల్ వ్యవసాయ అధికారికి వినతిపత్రం సమర్పించారు. వరి నాట్లు పూర్తయిన దశలో ఉన్నందున యూరియా అందకపోతే పంట నష్టం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఎక్కువకు ఎరువులు విక్రయిస్తున్న దుకాణాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యాప్ ద్వారా ఎరువుల బుకింగ్ రైతులకు ఇబ్బందులు కలిగిస్తోందని, స్మార్ట్‌ఫోన్ లేని రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. యాప్‌ను రద్దు చేసి పాత విధానంలోనే ఎరువులు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అయిలేని మల్లికార్జున రెడ్డి, మార్క శ్రీనివాస్ గౌడ్, యాస శ్రీనివాస్, ఇరుగు రమేష్, అయిలేని గాల్ రెడ్డి, గుగులోతు కనుక రాజు, తిరుపతి నాయక్, బత్తుల కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## పచ్చదనం పెంపునకు ప్రజలు భాగస్వాములు కావాలి



హుస్నాబాద్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : పురపాలక సంఘం ఆధ్వర్యంలో 1వ వార్డులో వనమహోత్సవం నిర్వహించారు. చైర్‌పర్సన్ దండి లక్ష్మి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా భావితరాలకు పచ్చని, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాలు, రహదారుల వెంట, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణకు బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. హుస్నాబాద్ పట్టణాన్ని పచ్చదనం, పరిశుభ్రతలో ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్‌చైర్‌పర్సన్ పద్మ, ఎఫ్ఆర్ఓ సిద్ధార్థ్, కౌన్సిలర్లు అనూష, లత, తిరుపతి, బొలిశెట్టి రాజు, సంపత్, మంజుల, వరప్రసాద్, రమేష్, వైద్యం కిరణ్ ప్రసాద్, స్వరూప, కో-ఆప్షన్ సభ్యులు గ్లోరినా, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టణాన్ని పచ్చగా మార్చేందుకు సమష్టి కృషి అవసరం



హుస్నాబాద్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : హుస్నాబాద్ మండలం మహమ్మదాపూర్ గ్రామంలో బృహత్ వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో, బీసీ సంక్షేమ--రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచనలతో గ్రామ పరిసరాల్లో మొక్కలు నాటారు. సర్పంచ్ జెల్లెల్ల తిరుమల, ఉపసర్పంచ్ కత్తుల సమ్మరాజు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాలు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. మొక్కలు నాటడం వలన కాలుష్య నివారణ, వర్షపాతం పెంపు, వాతావరణ చల్లదనం, పక్షులు--జంతువులకు ఆశ్రయం లభిస్తుందని అధికారులు తెలిపారు.

# బాధితునికి మరోసారి అండగా ఎమ్మెల్యే శ్రీగణేష్

**- సీఎంఆర్ఎఫ్ నుంచి మరో రూ.లక్ష ఎల్ఓసీ మంజూరు**

హైదరాబాద్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పథకం నిరుపేదలకు ఆపద సమయంలో అండగా నిలుస్తోందని సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. ఆర్థిక స్థోమత లేక వైద్య చికిత్స కోసం ఇబ్బందులు పడుతున్న బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం ఈస్ట్ మారేడ్‌పల్లి మహాత్మాగాంధీనగర్‌కు చెందిన జంగల్బ్రోయ్ సంతోష్ తీవ్ర అనారోగ్యంతో పంజాగుట్టలోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ వెంటనే స్పందించి, మంగళవారం సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.లక్ష విలువైన ఎల్ఓసీని మంజూరు చేయించి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. గతంలోనూ ఇదే బాధితునికి ఎమ్మెల్యే శ్రీగణేష్ చొరవతో సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.2 లక్షల ఎల్ఓసీ మంజూరైంది. అయితే సంతోష్ ఆరోగ్య పరిస్థితి



విషమించడంతో వైద్య చికిత్సకు మరింత ఆర్థిక సహాయం అవసరం కావడంతో కుటుంబ సభ్యులు మరోసారి ఎమ్మెల్యేను ఆశ్రయించారు. స్పందించిన శ్రీగణేష్ ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అదనంగా మరో రూ.లక్ష ఎల్ఓసీ మంజూరు చేయించారు. ఆపద సమయంలో తమ కుటుంబానికి అండగా నిలిచి, వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాటా



డుతూ.. ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# శిలాఫలకానికే పరిమితమైన పీహెచ్‌సీ ఉపకేంద్రం

**- రెండేళ్లు గడిచినా ప్రారంభం కాని నిర్మాణ పనులు**

మర్రిగూడ, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): మర్రిగూడ మండల కేంద్రానికి సమీపంలోని లెంకలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ప్రతిపాదించిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర (పీహెచ్‌సీ) భవన నిర్మాణం శిలాఫలకానికే పరిమితమైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శంకుస్థాపన చేసి చాలాకాలం గడిచినా నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. రూ.20 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఈ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రానికి 2024 జనవరి 24న రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి శంకుస్థాపన చేసి



శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అయితే ఇప్పటి వరకు భవన నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో ఈ ప్రాజెక్టు భవితవ్యంపై స్థానిక ప్రజలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో ఉపకేంద్రం మంజూరైనప్పటికీ, పనులు ప్రారంభం కాకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్థులు తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నిర్మాణ ప్రక్రియను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని పీహెచ్‌సీ ఉపకేంద్ర భవనం నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని లెంకలపల్లి గ్రామ ప్రజలు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు.

# దివ్యాంగుడికి డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కేటాయించాలి

**- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేసిన తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి నేతలు**

మల్కాజిగిరి, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నిరుపేద దివ్యాంగుడికి ప్రభుత్వం మానవతా దృక్పథంతో డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కేటాయించాలని కోరుతూ తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరుగు శివకృష్ణ మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మంగళవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన మెరుగు శివకృష్ణ.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని సింహాద్రినగర్, చంద్రగిరి కాలనీకి చెందిన 21 ఏళ్ల దివ్యాంగుడు రాహుల్ పరిస్థితిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రాహుల్ నిరుపేద కుటుంబానికి చెందినవాడని,



అనారోగ్య సమస్యల కారణంగా ఇప్పటివరకు సుమారు రూ.70 లక్షల వరకు వైద్య ఖర్చులు చేసినట్లు తెలిపారు. వైద్య ఖర్చులను భరించేందుకు కుటుంబానికి ఉన్న సొంత ఇంటిని సైతం విక్రయించాల్సి వచ్చిందని రాహుల్ తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమవుతూ ఎమ్మెల్యేకు వివరించారు. ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచి, రాహుల్‌కు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తిపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో పాటు కలెక్టర్‌తో మాట్లాడి, సాధ్యమైనంత త్వరగా రాహుల్‌కు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. దివ్యాంగుడి కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకుని సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి మెరుగు శివకృష్ణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు నర్సింగ్, వెంకన్న, రామ్‌యాదవ్, సీనియర్ జర్నలిస్ట్ చింతల విజయ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

# జైపాల్ జన్మదినం.. ఆమనగల్లులో గులాబీ సందడి

ఆమనగల్లు, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆమనగల్లులో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్క నిరంజన్ గౌడ్, మాజీ కౌన్సిలర్ కమటం రాధామ్మ వెంకటయ్య, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుల రాములు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు పాపిశెట్టి రాము, దుడ్డు ఆంజనేయులు యాదవ్, ఏనుమల్ల రమేష్, ఎంగలి భాగ్యమ్మ రఘు, అనూష శ్రీశైలం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ప్రజలకు చేసిన సేవలను నాయకులు కొనియాడారు. ఆయన ఆయురారోగ్యాలతో ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీను నాయక్, నాయకులు కోట శ్రీను, వస్పుల సాయిలు, గండికోట శంకర్, జంతుక కిరణ్, యూత్ వింగ్ అధ్యక్షుడు దేరంగుల వెంకటేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు లండం యాదయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షుడు రమేష్ నాయక్, కొమ్ము ప్రసాద్, ఎంగలి యాదగిరి, భీమయ్య, పరమేష్, హేమ్లు నాయక్, పంతు నాయక్, మహేష్ నేత, సాలయ్య, టీఆర్ఎస్వీ వర్షిత్, కృష్ణవేణి, తోట కృష్ణ, మహేష్



రాముల, కొప్పు కుమార్, కొప్పు నర్సింహ, సురేష్, రాజు, శ్రీను నాయక్, శివ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

**- జైపాల్ యాదవ్‌కు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు**

కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుర్కా జైపాల్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కడ్తాల్ మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లి ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి, పూలమాల వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి జైపాల్ యాదవ్ విశేష కృషి చేశారని, పదవిలో ఉన్నా లేకపోయినా ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆయన ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పరమేష్, అర్జున్ రావు, జోగు వీరయ్య, ప్రియా రమేష్ నాయక్, కదారి రామకృష్ణ, లచ్చిరాం నాయక్, మంగళపల్లి నరసింహ, కోట్య, గోపాల్, పర్వతాలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**- రావిచేడ్‌లో ఘనంగా జైపాల్ యాదవ్ జన్మదిన వేడుకలు**

కడ్తాల్ మండలం రావిచేడ్ గ్రామంలో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ అధ్యక్షుడు రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జైపాల్ యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా జైపాల్ యాదవ్ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేశారని కొనియాడారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అండగా నిలిచారని పేర్కొన్నారు. జైపాల్ యాదవ్ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ యాదయ్య, నాయకులు బాలకృష్ణ, కృష్ణయ్య, నర్సింహ, రమేష్, సాయికుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రధనలో సేవా స్ఫూర్తి.. 450 మందికి వైద్య సేవలు

**- లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం.. 30 మంది రక్తదానం**

ఆమనగల్లు, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో లయన్ కొత్త శంకరయ్య స్మారకార్థం చంద్రధన గ్రామంలో మంగళవారం మెగా వైద్య, రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. పీడీజీ లయన్ జూలూరి రమేష్ బాబు, రీజియన్ చైర్మన్ లయన్ ప్రశాంత్ రెడ్డి, జోన్ చైర్మన్ లయన్ రాంరెడ్డి, గ్రామ సర్పంచ్ సొల్లు రంగమ్మ శిబిరాన్ని ప్రారంభించారు. లయన్ డాక్టర్ వి. దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలోని వైద్య బృందం ప్రజలకు వైద్య సేవలు అందించింది. డాక్టర్ లయన్ కృష్ణ, డాక్టర్ లయన్ మహేశ్వర్ రెడ్డి, డాక్టర్ లయన్ శ్రీనివాస్ తదితరులు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి చికిత్సలు, సలహాలు అందించారు. శిబిరంలో డయాబెటిస్, కంటి, బీపీ, ఈఎన్‌టీ పరీక్షలు నిర్వహించగా లయన్ డాక్టర్ వెంకటస్వామి కంటి పరీక్షలు, లయన్ సంపత్ కుమార్, లయన్ శ్రీనివాస్ రెడ్డి డయాబెటిస్ పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరం చైర్మన్ లయన్ ఓంకారం, కో-చైర్మన్ లయన్ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరాన్ని 450 మందికి పైగా ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. అలాగే లయన్ అంజి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 30 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించిన లయన్స్ క్లబ్ సభ్యులను గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్



సెక్రటరీ లయన్ గంగుల శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి లయన్ గంప శ్రీనివాస్, జిల్లా చైర్మన్లు లయన్ జూలూరి రమేష్, లయన్ సునంద అంజయ్య, రీజియన్ సెక్రటరీ లయన్ సతీష్, లయన్ కె. రామ్ రెడ్డి, లయన్ ఎం. రాంరెడ్డి, లయన్ బండేలా రామచంద్ర రెడ్డి, లయన్ గోవర్ధన్ రెడ్డి, విష్ణువాస్ రెడ్డి, గుజ్జరి నర్సింహ, కర్నాటి కొండల్ రెడ్డి, పాండు రెడ్డి, నర్సింహ రెడ్డి, తిరుపతి రెడ్డి, పీఆర్వో లయన్ పాషా పాల్గొన్నారు. వార్డు సభ్యులు అంకుష్, అజయ్, పార్వతమ్మ, వెంకటేష్, బాలరాజు, కిట్టు, మహేష్, భారతమ్మ సత్తయ్య, శివకళ అయ్యన్న, అలివేల చెన్నయ్య, మాజీ ఎంపీటీసీ సుధాకర్ రెడ్డి, రాములు, మాజీ సర్పంచులు రాములు, గంజి శ్రీను, మంఖాల్ యాదయ్య, నిదురం యాదయ్య, చెన్నయ్య, జంగయ్య గౌడ్ తదితరులు పాల్గొని శిబిరం విజయవంతానికి సహకరించారు.

# లీగల్ సెల్ కన్వీనర్‌గా వోడ్నాల రవీందర్ పటేల్ నియామకం



**సుల్తానాబాద్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** తెలంగాణ మున్నూరు కాపు పటేల్ సంఘం పెద్దపల్లి జిల్లా లీగల్ సెల్ కన్వీనర్‌గా వోడ్నాల రవీందర్ పటేల్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రవీందర్ పటేల్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కన్వీనర్ పెంట రాజేష్, కమిటీ సభ్యులు, కుల బాంధవులకు ధన్యవాదాలు తెలిపారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తానని, లీగల్ సెల్ ద్వారా సమాజానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

# మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బాధ్యతలు స్వీకరించిన బండారి లత



**సుల్తానాబాద్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** బీజేపీ మహిళా మోర్చా పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శిగా బండారి లత నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతను అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మ హిళా మోర్చాను బలోపేతం చేయడంతో పాటు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, మహిళలను పెద్ద సంఖ్యలో పార్టీ కార్యక్రమాల్లో భాగ స్వాములను చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థ వంతంగా నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని బండారి లత అన్నారు.

## ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



**కరీంనగర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 27న కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించనున్నట్లు ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మహాధర్నాకు సంబంధించిన నోటీసును జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, కమిషనర్ ఆఫ్ పోలీస్ గౌస్ ఆలంకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను విడుదల చేయాలని, ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల బిల్లులు, పదవీ విరమణ బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరారు. ఉద్యోగుల సహనాన్ని పరీక్షించవద్దని హెచ్చరిస్తూ, "ఉద్యోగులు లేకుండా ప్రభుత్వం సజావుగా నడవదు" అని స్పష్టం చేశారు. మహాధర్నాకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, నాలుగో తరగతి ఉద్యోగులు, డ్రైవర్లు, పోలీస్ సిబ్బంది, అంగన్వాడీలు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మడిపల్లి కాళీ చరణ్ గౌడ్, సంఘం లక్ష్మణరావు, అరవింద్ రెడ్డి, కేశవరెడ్డి, ఉస్మాన్ పాషా, కిరణ్ కుమార్ రెడ్డి, అరవింద్ సింగ్, ప్రభాకర్ రెడ్డి, శారద సునీత, కోట రామస్వామి తదితర ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**హుజురాబాద్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కమలాపూర్ మండల కేంద్రంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. వ్యవ సాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్ పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పబ్బు సతీష్, ఉప సర్పంచ్ పుల్ల శ్రీనివాస్, జిపిఓ శిరీష రెడ్డి, వార్డు సభ్యులు, అధికారులు, రేషన్ డీలర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా వనమహోత్సవం కార్యక్రమాల నిర్వహణ



**కరీంనగర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జిల్లాలో వనమహోత్సవ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. హుజురాబాద్ పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్‌రావు, కమిషనర్ బి. కిషన్ ఆధ్వర్యంలో చెట్లు నాటారు. వైస్ చైర్మన్ అంజలి, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 137-ఏ ఆధ్వర్యంలో సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో 1,200 మొక్కలు నాటారు. ఇంజనీర్ కోల అన్నారెడ్డి పుట్టినరోజు సందర్భంగా ప్రారంభమైన ఈ కార్యక్రమం ఆరు రోజుల పాటు కొనసాగింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ముకరాంపుర ప్రభుత్వ పాఠశాలలో కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం కలిసి మొక్కలు నాటారు. విద్యార్థుల్లో పర్యావరణ అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని వారు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల పనిభారం తగ్గించాలని డిమాండ్



**కరీంనగర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఆర్టీసీ దీక్షలకు మద్దతుగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాయికంటి శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు. జూన్ 20న జరిగిన చర్చల్లో పనిభారాల తగ్గింపు అంశాన్ని డిపో, రీజియన్ స్థాయిలో కార్మిక సంఘాలతో చర్చించాలని ఇరుపక్షాలు అంగీకరించినప్పటికీ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. డిపోల్లో డ్యూటీలు ఏకపక్షంగా అమలు చేయడం కార్మికులకు భారమవుతోందని తెలిపారు. 2026 మే డే సం దర్భంగా ముఖ్యమంత్రి యూనియన్లతో చర్చించాలని నిర్ధారించినప్పటికీ ఫలితం లేకుండా అధికారులు మారుస్తున్నారని పేర్కొన్నారు. పనిభారాలను తగ్గించి ఉద్యోగ భద్రత కల్పించాలని, డిపో--రీజియన్ స్థాయిలో కార్మిక సంఘాలతో తక్షణమే చర్చలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో ఘనంగా సైన్స్ ఫెయిర్



**కరీంనగర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్ ఘనంగా జరిగింది. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ, విద్యుత్ ఆదా, పునరుత్పాదక ఇంధన వనరులు, ఆధునిక సాంకేతికత వంటి అంశాలపై రూపొందించిన నమూనాలను ప్రదర్శించారు. ప్రతి విద్యార్థి తన ప్రాజెక్ట్ ఉపయోగం, పనిచేసే విధానం, సమాజానికి కలిగే ప్రయోజనాలను వివరించి ఆకట్టుకున్నారు. ప్రధానాచార్యుడు మోర రణధీర్ విద్యార్థులను అభినందిస్తూ ఇటువంటి కార్యక్రమాలు పరిశోధనా దృక్పథం, సృజనాత్మకత పెంపొందిస్తాయని తెలిపారు. అత్యుత్తమ ప్రాజెక్టులు ఈ నెల 23, 24 తేదీల్లో సిద్దిపేటలో జరిగే విభాగ స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించబడతాయి. కార్యక్రమంలో ఇంజనీర్ కోల అన్నారెడ్డి, ఎలగందుల సత్యనా రాయణ, గట్టు శ్రీనివాస్, బొడ్ల శ్రీనివాస్, రాపర్తి శ్రీనివాస్, కొత్తూరి ముకుందం, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, పులల శ్యామ్ విద్యార్థుల ప్రదర్శనలను సందర్శించి ప్రశంసించారు.

# సిఐటియు ఆధ్వర్యంలో షాప్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నిరాహార దీక్ష



**కరీంనగర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** షాప్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కరీంనగర్ రీజియన్ కేంద్రంలో నిరాహార దీక్ష నిర్వహించారు. దీక్షకు సీఐటీయూ జిల్లా జాయింట్ సెక్రటరీ కొప్పుల శంకర్ హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం చర్చల్లో అంగీకరించిన అంశాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలవెన్స్‌లు 80% పెంచి అమలు చేయాలని, 2021 పై స్కేల్ అరియర్స్ చెల్లించాలని, బ్రెడ్ విన్నర్ స్కీమ్‌లో రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పనిభారాలను తగ్గించాలని, రిటైర్డ్ కార్మికులకు రావలసిన బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు శ్రీనివాస్ దీక్షకు మద్దతు ప్రకటించారు. అనంతరం సభ్యులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. కార్యక్రమంలో రీజియన్ అధ్యక్షుడు రాపెల్లి రాజయ్య, కార్యదర్శి వీరగోని శ్రీనివాస్, కోశాధికారి నాగరాజు, డిపో నాయకులు సంపత్, నాగరాజు, కుమార్, విశ్వేశ్వర్, ప్రసాద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిర్మూలించాలి వలస సుభాష్ చంద్రబోస్



**హుస్నాబాద్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిర్మూలన కోసం తమ సంస్థ రెండు దశాబ్దాలుగా కృషి చేస్తోందని తెలిపారు. వచ్చే సెప్టెంబర్‌లో రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పిల్లల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని 16 ఏళ్ల లోపు చిన్నారులకు సామాజిక మాధ్యమాల వినియోగంపై నిషేధం విధించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. అధిక మొబైల్ వినియోగం వల్ల విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసవడం, హింసాత్మక ఆలోచనలు పెరగడం, చదువుపై ఆసక్తి తగ్గడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు పిల్లల అలవాట్లపై పర్యవేక్షణ ఉంచాలని, ఉపాధ్యాయులు తరగతి గదుల్లో మొబైల్ వాడకాన్ని నియంత్రించాలని సూచించారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు, హానికర డిజిటల్ కంటెంట్‌పై కఠిన చట్టాలు తేవాలని ప్రభుత్వాన్ని కోరారు. పిల్లల భద్రత, భవిష్యత్తు కోసం సమాజం మొత్తం బాధ్యత వహించాలని, నేటి బాలలే రేపటి భారత పౌరులని సుభాష్ చంద్రబోస్ పేర్కొన్నారు. ఈ సమా వేశంలో న్యాయవాది జేరిపోతుల కిరణ్ కుమార్, నర్రా రాజిరెడ్డి, కొమ్ముల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వనమహోత్సవ కార్యక్రమం



**అమ్రాబాద్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రభుత్వ ప్రతిష్టాత్మక వనమహోత్సవ కార్యక్రమం అమ్రాబాద్ మండలంలో అట్టహాసంగా జరిగింది. అటవీ శాఖ, ఉపాధి హామీ సిబ్బంది సమన్వయంతో గ్రామ పంచాయతీల్లో మొక్కలు నాటారు. మండల కేంద్రంలోని విఐపీ లొకేషన్‌లో జరిగిన ప్రధాన కార్యక్రమానికి సర్పంచ్ చిగుర్ల కోటయ్య ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. రైతు గౌస్ అహ్మద్ పొలంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ "ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి సంరక్షించి తెలంగాణను హరిత తెలంగాణగా తీర్చిదిద్దాలి" అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటయ్య, ఎంపీడీవో రామన్న, అటవీ శాఖ బీట్ ఆఫీసర్ హనుమంతు, ఏపీవో రఘు, ఏసి కృష్ణ, సాంకేతిక సహాయకుడు బొంత ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి శివ, ప్రజాప్రతినిధులు, నాయకులు తిరుమలయ్య, గోలి మల్లేష్, నోముల సురేష్, సయ్యద్ ఆరిఫ్, మైనారిటీ నాయకులు, ఉపాధి హామీ కూలీలు, మహిళలు పాల్గొన్నారు. నాటిన మొక్కలను సంరక్షించేందుకు కూలీలు, పంచాయతీ సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. మండలమంతా పచ్చదనంతో కళకళలాడేలా చేస్తామని అధికారులు తెలిపారు.

## సబ్‌స్టేషన్ ప్రారంభించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



**మానకొండూర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం దేవంపల్లి గ్రామంలో రూ.3.06 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. లోవోల్టేజీ సమస్యలు తొలగించేందుకు ఉపకేంద్రాల ఏర్పాటు జరుగుతోందని, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని సూచించారు. ఈ సబ్‌స్టేషన్ ద్వారా దేవంపల్లి, లలితాపూర్, అన్నారం గ్రామాలకు విద్యుత్ సమస్యలు తీరనున్నాయని, 675 వ్యవసాయ కనెక్షన్లు, 2316 గృహ కనెక్షన్లకు నాణ్యమైన సరఫరా అందుతుందని చెప్పారు. గంగిపల్లి, మానకొండూర్ సబ్‌స్టేషన్లపై లోడ్ తగ్గుతుందని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతులను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో వరలక్ష్మి, తహసీల్దార్ విజయ్‌కుమార్, విద్యుత్ శాఖ ఇంజినీర్లు, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

## వర్షాకాల వ్యాధుల నివారణకు మున్సిపల్ చర్యలు



**ఖానాపూర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఖానాపూర్ మున్సిపల్ 5వ వార్డులో కౌన్సిలర్ మేష పోచమ్మ ఆధ్వర్యంలో మురికి కాలువలకు దోమల నివారణ స్ప్రే పిచికారి చేశారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా నిరంతరంగా స్ప్రే కార్యక్రమం కొనసాగుతుందని కౌన్సిలర్ తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, చెత్తను రోడ్లపై వేయకూడదని సూచించారు. రోడ్లు అపరిశుభ్రంగా ఉంటే ఈగలు, దోమలు వ్యాప్తి చెంది అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు.

# పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి - ఎస్ఐ జగదీశ్వర్



**హుస్నాబాద్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామంలోని బయన్నబోరు వద్ద వనమహోత్సవం సందర్భంగా 500 మొక్కలు నాటారు. గ్రామ సర్పంచ్ అలువాల శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఐ జగదీశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కొత్త మధు, కోల స్వరూప, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, ఉపాధి హామీ కూలీలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. నిర్వాహకులు గ్రామంలో పచ్చదనం పెంపొందించే కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలలో ఘనంగా ఓనం సంబరాలు




**కరీంనగర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో ఓనం పండుగను వైభవంగా నిర్వహించారు. కేరళలో అత్యంత ఘనంగా జరుపుకునే ఓనం పండుగను పురస్కరించుకొని పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని పూల పూకలంతో పండుగ శోభను పెంచారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఓనం మహాబలి చక్రవర్తి జ్ఞాపకార్థంగా జరుపుకునే పండుగ అని, పంటల పండుగగా కూడా ప్రసిద్ధి చెందిందని తెలిపారు. పూకలం అలంకరణలు, పడవల పోటీలు పండుగకు ప్రత్యేకతను తీసుకొస్తాయని వివరించారు. పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడంతో పాటు ప్రజల్లో ఐక్యతా భావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా ప్రెషర్ డే వేడుకలు




**గంగాధర, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ జిల్లా గంగాధర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రెషర్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థులను ఆత్మీయంగా స్వాగతించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఐఈఓ సత్యవర్ధన్ విద్యార్థులు ప్రణాళికతో చదివి ఉన్నత స్థాయిలో నిలవాలని సూచించారు. ప్రిన్సిపాల్ సత్యనారాంజనేయ మాట్లాడుతూ విద్యార్థులు కలలు కనడం మాత్రమే కాకుండా కష్టపడి రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, లైబ్రేరియన్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈ నెలాఖరులోగా 17 లక్షల మొక్కలు నాటాలి కలెక్టర్ కె. హైమావతి



**సిద్దిపేట, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జిల్లాలో వనమహోత్సవం భాగంగా ఈ నెలాఖరులోగా 17 లక్షల మొక్కలు నాటుతామని కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. మంగళవారం ఇర్కోడు గ్రామంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మొక్కలు నాటారు. ఇప్పటివరకు 12 లక్షలకు పైగా మొక్కలు నాటినట్లు, ఒక్కరోజే రెండున్నర లక్షల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు వరి సాగుకు బదులుగా కంది, జనుము, వేరుశనగ, తృణధాన్యాలు వంటి మెట్ట పంటలపై దృష్టి సారించాలని సూచించారు. భూగర్భ జలాలను పెంచుకునేందుకు ఉచితంగా ఫామ్‌పాండ్లు నిర్మించుకోవాలని రైతులకు సూచించారు. గ్రామాల్లో వార్డు సభ్యులు, మహిళా సంఘాలు, రైతులను ఫామ్‌పాండ్ల నిర్మాణం వైపు ప్రోత్సహించాలని సర్పంచ్‌కు సూచించారు. మొక్కలు నాటిన ప్రాంతంలో సామూహిక ఫామ్‌పాండ్ నిర్మించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ప్రియా, ఏడీ సర్వే ల్యాండ్ సుదర్శన్, ఎక్సైజ్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక

బుధవారం,
ఆగస్టు 26, 2026



## మున్సిపల్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని వినతి



హుజురాబాద్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : హుజురాబాద్ మున్సిపల్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో మున్సిపల్ పాలకవర్గం వినతి పత్రం అందజేశారు. మంగళవారం సైదాపూర్ మండలంలోని ఆకునూరు గ్రామంలో మంత్రి పొన్నంను కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, వైస్ చైర్‌పర్సన్ అంజలి, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అభివృద్ధి నిధులపై విజ్ఞప్తి చేశారు. మంత్రి సానుకూలంగా స్పందించి తప్పకుండా నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## నూతన రేషన్ కార్డుల పంపిణీ



సుల్తానాబాద్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ప్రజా పాలనలో భాగంగా అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం గట్టేపెల్లి గ్రామంలో ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ గుండేటి దేవేందర్, పాలకవర్గ సభ్యులు, గ్రామ కార్యదర్శి మీనా ఆధ్వర్యంలో అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డులు అందజేశారు. లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందరికీ చేరాలని కోరారు. అదే రోజు గ్రామంలో వనమహోత్సవం కూడా నిర్వహించారు. సర్పంచ్ దేవేందర్, పాలకవర్గ సభ్యులు, అధికారులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములయ్యారు. గ్రామాన్ని పచ్చదనంతో నింపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పంచాయతీ సభ్యులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటిన ఎమ్మెల్యే విజయరమణ రావు



పెద్దపల్లి, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : వన మహోత్సవంలో భాగంగా పెద్దపల్లి ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు సబ్బితం గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి మొక్కలు నాటారు. మొక్కల పెంపకం, సంరక్షణపై ప్రత్యేక సూచనలు చేస్తూ వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు. మొక్కల పెంపకం వివరాలను రికార్డు చేసుకోవాలని సూచించారు. వచ్చే ఏడాదికి సబ్బితం వాటర్‌ఫాల్స్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, అటవీ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## ఇండియా మిషన్ హై స్కూల్‌లో షీ టీమ్ అవగాహన సదస్సు నిర్వహణ



పెద్దపల్లి, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : రామగుండం సి.పి ఆదేశాల మేరకు పెద్దపల్లి షీ టీమ్ ఆధ్వర్యంలో ఇండియా మిషన్ హై స్కూల్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. షీ టీమ్ ఇంచార్జి ఎస్సై లావణ్య విద్యార్థులకు గుడ్ టచ్, బాడ్ టచ్, టీనేజ్ సమస్యలు, పోక్సో యాక్ట్, సోషల్ మీడియా ప్రభావం, ప్రవర్తన నియమావళి గురించి వివరించారు. మహిళల భద్రత, ఆన్లైన్ మోసాలు, యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. మహిళలు, విద్యార్థులు వేధింపులకు గురైతే భయపడకుండా 6303923700 నంబర్‌కు ఫోన్ చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో 100/112 నంబర్లకు డయల్ చేయాలని సూచించారు. ఆన్లైన్ మోసాలకు గురైతే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని, ప్రయాణ సమయంలో టీ సేఫ్ యాప్ వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ జయరాజ్, ఉపాధ్యాయులు, షీ టీమ్ సభ్యులు సురేష్, మౌనిక, స్నేహలత పాల్గొన్నారు.

## ఘనంగా కొలిపాక శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



పెద్దపల్లి, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్ 38వ జన్మదిన వేడుకలు పెద్దపల్లి పట్టణంలోని ఆర్య వైశ్య భవన్‌లో ఘనంగా జరిగాయి. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసిన అనంతరం గజమాలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో 200 మందికి పైగా పాల్గొన్నారు. శ్రీనివాస్ మాట్లాడుతూ తన జన్మదినం సందర్భంగా ప్రజలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై శుభాకాంక్షలు తెలిపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రక్తదానం చేసిన వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని చెప్పారు. 2028లో పెద్దపల్లిలో బీసీ జెండా ఎగరేయడం ఖాయమని, అన్ని కులాలు, మతాలను కలుపుకొని ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచులు, కౌన్సిలర్లు, ముదిరాజ్ సంఘం నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, రక్తదాతలు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్లో అభివృద్ధి పనులకు శ్రీకారం



పెద్దపల్లి, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్లో రూ. 1.39 కోట్ల నిధులతో డ్రైన్ ప్లాట్‌ఫాం, మరుగుదొడ్ల బ్లాక్ నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి పెద్దపీట వేస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. రైతులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, గింజ కటింగ్ లేకుండా సజావుగా కొనుగోళ్లు జరుగుతున్నాయని తెలిపారు. గత పాలకులు కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రైతులను మోసగించారని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించిందని విమర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, మార్కెట్ చైర్మన్, డైరెక్టర్లు, సింగిల్ విండో చైర్మన్లు, పట్టణ కౌన్సిలర్లు, సర్పంచులు, రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆదిత్య జూనియర్ కళాశాలలో నేత్రదాన అవగాహన శిబిరం ఏర్పాటు



ఆత్మకూరు, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ఆత్మకూరులోని ఆదిత్య జూనియర్ కళాశాలలో నేత్రదాన అవగాహన శిబిరం జరిగింది. కంటి వైద్య నిపుణుడు పి. షేక్షావలి నేత్రదానం ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. మరణానంతరం కార్నియాను సేకరించడం ద్వారా ఇద్దరు అంధులకు చూపు కల్పించవచ్చని, ఈ ప్రక్రియలో దాత కుటుంబానికి ఎలాంటి ఆర్థిక భారం ఉండదని తెలిపారు. వయస్సుతో సంబంధం లేకుండా నేత్రదానం చేయవచ్చని, ప్రజలు అపోహలను వీడి ముందుకు రావాలని సూచించారు. నేత్రదానం ద్వారా మరణానంతరం కూడా మరొకరి జీవితంలో వెలుగులు నింపవచ్చని వైద్యులు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన పెంచుకుని కుటుంబ సభ్యులు, స్నేహితులకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయ భాస్కర్ నాయుడు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రమాద బాధిత కుటుంబానికి గణేష్ గౌడ్ చేయూత



ఆమనగల్లు, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): గతంలో జరిగిన ప్రమాదం కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న రేపని యాదయ్య కుటుంబానికి కడ్తాల్ మండల బీసీ సంఘం అధ్యక్షుడు, కడ్తాల్ 9వ వార్డు సభ్యుడు మాదారం గణేష్ గౌడ్ మంగళవారం రూ. 15 వేల ఆర్థిక సాయం అందించారు. కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఆయన తనవంతు బాధ్యతగా ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. ఆపదలో ఉన్న వారికి చేయూత అందించడం మానవతా దృక్పథానికి నిదర్శనమని గణేష్ గౌడ్ తెలిపారు. కష్టాల్లో ఉన్న కుటుంబాలకు అండగా నిలిచి, అవసరమైన సమయంలో తనవంతు సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని పేర్కొన్నారు. ప్రమాదం కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న యాద య్య కుటుంబానికి ఈ ఆర్థిక సాయం కొంత మేర ఉపశమనం కలిగిస్తుందని తెలిపారు. సమాజంలో ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం ద్వారా మానవత్వాన్ని చాటుకోవాలని గణేష్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం గౌరవ అధ్యక్షుడు వరికుప్పల రాజు, హనుమాన్ యూత్ అ ధ్యక్షుడు మహేందర్ రెడ్డి, నార్లకంటి శేఖర్, చిన్నం వెంకటేష్, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ నోటీసులు అందుకున్న ఓటర్లు ఆధారాలతో హాజరు కావాలి

**– ఆమనగల్ మున్సిపాలిటీలో 4,437 నోటీసుల జారీ**



ఆమనగల్లు, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని ఓటర్లకు నోటీసులు జారీ చేస్తున్నట్లు ఏఈఆర్ఓ, మున్సిపల్ కమిషనర్ ఎస్. రాఘవేందర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 19 పోలింగ్ కేంద్రాలు ఉండగా, మొత్తం 4,437 ఎస్ఐఆర్ నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు అందులో పేర్కొన్న వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. నోటీసు వెనుక భాగంలో సూచించిన 13 రకాల ఆధారాల్లో ఏవైనా మూడు ఆధారాలను సమర్పించాల్సి ఉంటు oదని తెలిపారు. నోటీసులో కేటాయించిన తేదీ, సమయం, ప్రదేశంలో సంబంధిత ఆధారాలతో హాజరై ఏఈఆర్ఓ, మున్సిపల్ కమిషనర్ సమక్షంలో తమ వివరణ లేదా సమాధానాన్ని సమర్పించాలని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ నోటీసులు అందుకున్న ప్రతి ఓటరు ఈ ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొని, నోటీసులో సూచించిన తేదీన సంబంధిత ఆధారాలతో హాజరు కావాలని అధికారులు కోరారు. ఓటర్లందరూ ఎస్ఐఆర్ ప్రక్రియకు సహకరించి, తమ వివరాల ధ్రువీకరణ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసుకోవాలని సూచించారు.

## ఆమనగల్‌లో వనమహోత్సవానికి ఘనంగా శ్రీకారం



**– పచ్చదనం పరిరక్షణే లక్ష్యంగా ఆమనగల్--జంగారెడ్డిపల్లి రహదారిపై భారీగా మొక్కల నాటకం**

ఆమనగల్లు, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఆమనగల్ పట్టణంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా పురపాలక సంఘం, అటవీశాఖ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆమనగల్--జంగారెడ్డిపల్లి ప్రధాన రహదారికి ఇరువైపులా, ఆమనగల్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎన్. పత్య నాయక్, వైస్ చైర్‌పర్సన్ టి. గీతా ఆచారి, మున్సిపల్ కమిషనర్ ఎస్. రాఘవేందర్ రెడ్డి, ఆమనగల్ ఎస్‌హెచ్ఓ ఎస్. వెంకటేశ్వర్లు, అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ జగన్ మోహన్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పట్టణాన్ని పచ్చదనంతో నింపేందుకు ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్ రెడ్డి, కౌన్సిలర్లు ఆంజనేయులు, సునీత ప్రశాంత్, ధోలి, పాపిశెట్టి రామకృష్ణ, ఎ. రమేష్, ఎం. వెంకటయ్య, మున్సిపల్ మేనేజర్ ఆంజనేయులు, మున్సిపల్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు

**– పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నాం: సర్పంచ్ రంగులత శ్రీనివాస్ గౌడ్**

ఎలిగేడు, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు నారాయణపల్లి గ్రామ సర్పంచ్ రంగులత శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని పారిశుద్ధ్య కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం గ్రామంలోని పలు వార్డుల్లో రోడ్లకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్లపొదల తొలగింపుతో పాటు వాటిపై మందు పిచికారీ చేపట్టారు. వర్షాకాలంలో వ్యాధులు వ్యాపించే అవకాశమున్న నేపథ్యంలో గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణం నెలకొ ల్పేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ తెలిపారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామ ప్రజలు కూడా అవగాహనతో వ్యవహరించాలని, దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా ప్రతి ఒ క్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణకు గ్రామ పంచాయతీ నిరంతరం చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొత్తిరెడ్డి బాపురెడ్డి, గ్రామ కార్యదర్శి పాపయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్, ఉప సర్పంచ్



అమ్రాబాద్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం అమ్రాబాద్ మండల కేంద్రంలో ఘనంగా జరిగింది. అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ చిగురూ కోటయ్య, ఉప సర్పంచ్ నోముల రాజారాం చేతుల మీదుగా అర్హులైన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు అందజేశారు. సర్పంచ్ కోటయ్య మాట్లాడుతూ, "రేషన్ పంపిణీలో ఇకపై అక్రమాలకు తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సరుకులు అందుతాయి. ఎవరైనా మిగిలిపోతే పంచాయతీని సంప్రదించాలి" అని తెలిపారు. కార్డులు అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శివ, రెవెన్యూ సిబ్బంది, మండల అధికారులు, రేషన్ డీలర్లు, గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జమ్మిచెట్టు--అరుగు నిర్మాణానికి స్థలం కేటాయించాలని వినతి



పాములపాడు, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : జమ్మిచెట్టు అరుగును నిర్మించేందుకు ప్రభుత్వ భూమిని కేటాయించాలని బీజేపీ మండల అధ్యక్షుడు రాయపాటి మురళీమోహన్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ గ్రామ ప్రజలతో కలిసి తహసీల్దార్ జి. సుభద్రమ్మకు వినతి పత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ రుద్రవరం గ్రామంలోని పురాతన జమ్మిచెట్టు 340 సి నేషనల్ హైవే నిర్మాణం కోసం తొలగించబడిందని, దసరా పండుగ సందర్భంగా గ్రామ ప్రజలు సంప్రదాయంగా జమ్మిచెట్టుకు పూజలు చేసి ఆకులు తీసుకొని పెద్దలు, దేవాలయాలకు దీవిం చుకునే ఆచారం కొనసాగుతోందని తెలిపారు. అలాంటి పవిత్రమైన జమ్మిచెట్టు అరుగును తిరిగి నిర్మించేందుకు స్థలం కేటాయించాలని కోరారు. తహసీల్దార్ సుభద్రమ్మ స్పందిస్తూ విఆర్ఓ ద్వారా స్థలాన్ని పరిశీలించి కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సూర్యం, వెంకటేశ్వర్లు, షాలు, గ్రామ ప్రజలు శివ, ప్రసాద్, వేణుగోపాల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు శక్తి యాప్ పై అవగాహన సదస్సు




నందికొట్కూరు, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఆదేశాల మేరకు, ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ సూచనలతో నందికొట్కూరు సర్కిల్ శక్తి టీం మారుతి నగర్ మహిళలకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించింది. ఏఎస్ఐ ఎస్. ఖాదర్ బాషా, పీసీ రసూల్ శక్తి వాట్సాప్ నంబర్ 7993485111, అత్యవసర నంబర్లు 112, 100, 181, 1098, 1930 ప్రాముఖ్యతను వివరించారు. పిల్లల భద్రత, అనుమానాస్పద వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ మొబైల్‌లో శక్తి యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శక్తి టీం సభ్యులు, మారుతి నగర్ మహిళలు పాల్గొన్నారు.

## ఇంటింటికి టిడిపి ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే



నందికొట్కూరు, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య ఆధ్వర్యంలో పాలమర్రి గ్రామంలో "రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి సంక్షేమం" డోర్ టు డోర్ ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని, ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. గ్రామంలో డ్రైనేజీ కాలువలు, పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు, విద్యుత్ సమస్యలు, త్రాగునీటి చేతిపంపుల మరమ్మత్తులు, కొత్త బాత్రూం నిర్మాణ పథకాలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పలుచాని మహేశ్వర్ రెడ్డి, నాయకులు రాజన్న, యూనిట్ ఇంచార్జ్ దామోదర్ రెడ్డి, ఒగిలి శ్రీనివాసులు, బూత్ ఇంచార్జ్‌లు శ్రీను, పాండు, రమేష్, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన



నంద్యాల, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్--2026)లో భాగంగా ఎన్నికల పరిశీలకురాలు పి. ప్రశాంతి, ఐఏఎస్, నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని పోలింగ్ కేంద్రం, ఎస్‌పిజి మిషన్ కాంపౌండ్, ఎస్‌పిజి హై స్కూల్ తదితర కేంద్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని ఆమె పరిశీలించారు. క్లెయిమ్స్, అబ్జెక్షన్స్, ఫారమ్--6, 7, 8 దరఖాస్తుల పరిష్కారం, ఏఎస్‌డీ--డి లిస్ట్, మ్యాపింగ్, నోటీసుల సర్వీస్, హియరింగ్ కేసులు, హెచ్‌టు--హెచ్ వెరిఫికేషన్ వంటి అంశాలపై అధికారుల నుండి వివరాలు తెలుసుకున్నారు. బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించి, కేసుల వారీగా పురోగతి, పెండింగ్ అంశాలను సమీక్షించారు. అర్హులైన ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, నిర్ణీత గడువులో ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## వృద్ధులకు న్యాయ సేవలపై అవగాహన సదస్సు



నందికొట్కూరు, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : న్యాయ సేవల అధికార సంస్థల ఆధ్వర్యంలో నల్సా లీగల్ సర్వీసెస్ టు సీనియర్ సిటిజన్స్ స్కీమ్--2016 పై అవగాహన కార్యక్రమం నందికొట్కూరు పగిడ్యాల రోడ్డులోని శ్రీ కాళీ ప్రసాద ఆశ్ర మంలో జరిగింది. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్-కమ్-ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి జి. కబర్ధి, కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వృద్ధులకు న్యాయ సేవలు, హక్కులు, రక్షణలు, వైద్య సహాయం, ఉచిత న్యాయ సలహాలు గురించి వివరించారు. పిల్లలచే నిర్లక్ష్యానికి గురైన వృద్ధులు రెవెన్యూ అధికారులను సంప్రదించి సమస్యలు పరిష్కరించుకోవచ్చని, అలాగే న్యాయ సహాయం కోసం టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ 15100 ను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిటైర్డ్ జిల్లా జడ్జి మోహన్ రావు, సివిల్ జడ్జి ఎ. శోభారాణి, జూనియర్ డివిజన్ జడ్జి వి. దివ్య, బార్ అసోసియేషన్ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో కనీస విద్యా సామర్థ్యాలు పెంపొందేలా బోధించాలి

**– ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ సూచన**



**నల్లగొండ, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** విద్యార్థుల్లో ప్రాథమిక స్థాయిలోనే కనీస విద్యా సామర్థ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. చదవడం, రాయడంతో పాటు తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో పదాలకు అర్థాలు తెలుసుకునేలా విద్యార్థులకు బోధించాలని తెలిపారు.మంగళవారం నల్లగొండ జిల్లా, నల్లగొండ మండలంలోని కంచనపల్లి ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా సామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులు చదవడం, రాయడంలో ఎంతవరకు ప్రావీణ్యం సాధించారో తెలుసుకున్నారు.ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు పునాది బలంగా ఉంటేనే పై తరగతుల్లో పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకోగలుగుతారని కలెక్టర్ పేర్కొన్నారు. అందువల్ల ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం అలవాటు చేయడంతో పాటు తెలుగు, ఇంగ్లీష్‌లో కొత్త పదాలను పరిచయం చేసి వాటి అర్థాలను వివరించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతిరోజూ చదవడం, రాయడంపై ప్రత్యేకంగా ప్రాక్టీస్ చేయించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించారు. వారికి అందుతున్న యూనిఫామ్‌ల గురించి ఆరా తీశారు. విద్యార్థులందరికీ యూనిఫామ్‌లు అందజేయాలని, యూనిఫామ్‌లు అందుకున్న వారు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. అవసరమైతే పాఠశాలలోనే యూనిఫామ్‌లకు అవసరమైన ఆల్టరేషన్ చేయించేందుకు టైలర్లను పిలిపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అనంతరం పాఠశాల పరిసరాలు, తరగతి గదులను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు అనుకూలమైన వాతావరణం కల్పించడంపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. స్థానిక సర్పంచ్ మహేశ్వరితో మాట్లాడుతూ పాఠశాలను తరచూ సందర్శించి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించాలని, వారి విద్యాభివృద్ధికి అవసరమైన సహకారం అందించాలని కోరారు.

# నాటిన ప్రతి మొక్కకు నిరంతరం నీరందించాలి: జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**నల్లగొండ, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వనమహోత్సవం కింద నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను సంబంధిత అధికారులు, గ్రామపంచాయతీలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచించారు. మొక్కలు నాటడంతోనే బాధ్యత పూర్తికాదని, అవి ఏపుగా పెరిగే వరకు నిరంతరం సంరక్షించాలని తెలిపారు.వనమహోత్సవంలో భాగంగా మంగళవారం నల్లగొండ మండలం గుండ్లపల్లి గ్రామంలో రహదారికి ఇరువైపులా 800 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వనమహోత్సవం కింద జిల్లాలో ఈ ఏడాది 57.70 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 60 శాతం మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేశామని, మిగిలిన లక్ష్యాన్ని సైతం నిర్ణీత సమయంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం సామూహికంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, మండలాలు, గ్రామపంచాయతీలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అందుబాటులో ఉన్న ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటుతున్నట్లు చెప్పారు.జిల్లాలో అక్కడక్కడా తుంపర వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వాతావరణ పరిస్థితులను సద్వినియోగం చేసుకుని మొక్కలు నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాకు నిర్దేశించిన మొక్కల నాటే లక్ష్యాన్ని పూర్తిచేయడంతో పాటు నాటిన ప్రతి మొక్కను బతికించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రతి మొక్కకు క్రమం తప్పకుండా నీరందించాలని, ఇందుకోసం గ్రామపంచాయతీ ట్రాక్టర్లను వినియోగించుకోవాలని సూచించారు. అవసరమైతే వాచర్లను ఏర్పాటు చేసి మొక్కల సంరక్షణ బాధ్యతలను అప్పగించాలని తెలిపారు. మొక్కలకు నీటి కొరత లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వి. రమేష్, డీఎఫ్ఓ రాజశేఖర్, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రమేష్, ఫారెస్ట్ రేంజ్ అధికారి రవీందర్, ఉపసర్పంచ్ జే.కే. సతీష్, మాజీ జెడ్పీటీసీలు గుమ్మల మోహన్‌రెడ్డి, వంగూరు లక్ష్మయ్య, కోదండపూర్ సర్పంచ్ రాణి వెంకన్న, ఎంపీడీవో యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన పని భారాలను తగ్గించాలి

**– ఉద్యోగ భద్రత కల్పించాలి.. అంగీకరించిన అంశాలను వెంటనే అమలు చేయాలి**



**నల్లగొండ, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆర్టీసీ సమ్మె విరమణ సందర్భంగా ప్రభుత్వం, యాజమాన్యం అంగీకరించిన ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ నల్లగొండ డిపో గౌరవాధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దండెంపల్లి సత్తయ్య డిమాండ్ చేశారు. కార్మికులపై పెంచిన పని భారాలను తగ్గించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం నల్లగొండ రీజినల్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షలను ప్రారంభించిన అనంతరం దండెంపల్లి సత్తయ్య మాట్లాడుతూ.. సమ్మె సందర్భంగా కార్మికులు సంపూర్ణ ఐక్యతతో పోరాడారని, దాదాపు ఏడేళ్ల అనంతరం ప్రభుత్వం చొరవతో కార్మిక సంఘాలతో యాజమాన్యం చర్చలు జరిపి పలు అంశాలను అంగీకరించిందని తెలిపారు. అయితే అంగీకరించిన అంశాలను అమలు చేయడంలో జాప్యం జరుగుతోందని ఆరోపించారు.ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆందోళనల ఫలితంగా జాబ్ సెక్యూరిటీ కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు బోర్డు సమావేశం నిర్వహించినప్పటికీ, నిర్ణయాల అమలులో ఇంకా జాప్యం కొనసాగుతోందన్నారు. అంగీకరించిన అంశాలను వెంటనే అమలు చేయాలని, కార్మిక సంఘాలతో చర్చించి పెంచిన పని భారాలను తగ్గించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.జూన్ 20న ఈడీ కమిటీతో జరిగిన చర్చల్లో పని భారాల తగ్గింపుపై కార్పొరేట్ స్థాయిలో చర్చించడం కంటే సర్వీసులు అమలవుతున్న డిపో, రీజియన్ స్థాయిలో కార్మిక సంఘాలు, యాజమాన్యం చర్చలు జరపాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రతిపాదించిందని తెలిపారు. దీనికి ఇరుపక్షాలు అంగీకరించినప్పటికీ, ఆ అంగీకారానికి భిన్నంగా అధికారులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. డిపోల్లో డ్యూటీలను ఏకపక్షంగా అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.2026 మేడే సందర్భంగా డిపో మేనేజర్ నుంచి మేనేజింగ్ డైరెక్టర్ వరకు యూనియన్లతో ఎలా వ్యవహరించాలనే అంశంపై ముఖ్యమంత్రి స్వయంగా ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఫలితం కనిపించడం లేదన్నారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని డ్యూటీలను శాస్త్రీయ పద్ధతిలో రూట్ సర్వే నిర్వహించి రన్నింగ్ టైమ్ నిర్ణయించాలని, తద్వారా కార్మికులపై పని భారాన్ని తగ్గించాలని కోరారు.అనేక డిపోలు, రీజియన్లలో సర్వీసులను ఏకపక్షంగా మారుస్తున్నారని, తక్షణమే కార్మిక సంఘాలతో డిపో, రీజియన్ స్థాయిలో చర్చలు జరిపి అంగీకారంతో నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలవెన్సులను 80 శాతం పెంచాలని, బెడ్ విన్నర్లను పర్మినెంట్ చేయాలని, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు.ఈ నిరాహార దీక్షల్లో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కోశాధికారి కేఎస్ రెడ్డి, రీజియన్ సహాయ కార్యదర్శి కే. శ్యాంసుందర్, డిపో అధ్యక్షుడు ఎం. నరసింహయ్య, మిర్యాలగూడ డిపోకు చెందిన రాములు, నల్లగొండ డిపో మాజీ కార్యదర్శి బోడ స్వామి, సీహెచ్ రేవతి, పెరుమాళ్ల రాములు, లక్ష్మీనారాయణ, సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఔటర్ రవీందర్, అద్దంకి నరసింహ, గంజి రాజేష్, సుంకరబోయిన వెంకన్న, కట్ట శంకరయ్య, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

**– దీక్షలకు రిటైర్డ్ ఉద్యోగుల మద్దతు**

ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో నల్లగొండ రీజియన్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న నిరాహార దీక్షా శిబిరాన్ని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు సందర్శించి తమ మద్దతు ప్రకటించారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘాల నేతలు ఏ.ఎస్. నందం, సత్తార్, డి.ఎస్. చారి, రాములు తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్ బకాయిలు వెంటనే చెల్లించాలి

**– ఉద్యమాన్ని ఉధృతం చేయాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తీర్మానం**




**నల్లగొండ, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెన్షన్ బకాయిలు, వేతన సవరణ సంఘం అమలు, ఆరు విడతల కరవు భత్యం చెల్లింపు, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ తదితర సమస్యలను పరిష్కరించేందుకు ఉద్యమాన్ని ఉధృతం చేయాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తెలంగాణ--2024 నల్లగొండ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం తీర్మానించింది. నల్లగొండలోని పీఆర్‌టీయూ భవన్‌లో మంగళవారం ఉదయం జిల్లా అధ్యక్షుడు కాటబత్తుల గణేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు కోహెడ చంద్రమౌళి, ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి కొంపెల్లి బిక్షపతి, రాష్ట్ర నాయకులు తీగల శంకరయ్య, దివాకర్‌తో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులు, పెద్ద సంఖ్యలో విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

**-బకాయిలు ఏకమొత్తంగా చెల్లించాలి**

2024 మార్చి తర్వాత వివిధ శాఖల్లో ఉద్యోగ విరమణ పొందిన పలువురు విశ్రాంత ఉద్యోగులు సమావేశానికి హాజరై తమకు రావాల్సిన పెన్షన్ బకాయిలను ప్రభుత్వం ఇప్పటివరకు పూర్తిగా ఏకమొత్తంగా చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సమావేశం నిర్ణయించింది .రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ, విశ్రాంత ఉద్యోగ సంఘాలు సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న దశలవారీ ఉద్యమంలో భాగంగా ఈ నెల 27న జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్ల ఎదుట నిర్వహించే ధర్నాకు రిటైర్డ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు.ప్రస్తుతం ప్రభుత్వ సర్వీసులో ఉన్న ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, సీపీఎస్ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, పెండింగ్ బిల్లులను సకాలంలో చెల్లించకపోవడం, సీపీఎస్ రద్దు, ప్రత్యేక ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్లు, ఉద్యోగుల ఆరోగ్య కార్డులు, వేతన సవరణ సంఘం అమలు, పెండింగ్‌లో ఉన్న ఆరు విడతల కరవు భత్యం చెల్లింపు తదితర సమస్యల పరిష్కారం కోసం అన్ని ఉద్యోగ, విశ్రాంత ఉద్యోగ సంఘాలు సంయుక్త కార్యాచరణ సమితిగా ఏర్పడి ఉద్యమానికి సిద్ధమయ్యాయని తెలిపారు.ఈ మేరకు ప్రభుత్వానికి ఉద్యమ కార్యాచరణపై నోటీసు అందజేశారు. ఆగస్టు 27న కలెక్టరేట్ల ఎదుట ధర్నా, సెప్టెంబరు 1న పెన్షన్ వ్యతిరేక దినం, సెప్టెంబరు 10న హైదరాబాద్‌లో శాసనసభ ముట్టడి, మహాధర్నా నిర్వహించనున్నట్లు సంయుక్త కార్యాచరణ సమితి ప్రకటించింది.ఈ కార్యక్రమాలను విజయవంతం చేసి పెన్షన్ బకాయిలు, వేతన సవరణ సంఘం అమలు, ఆరు విడతల కరవు భత్యం చెల్లింపు, సీపీఎస్ రద్దు తదితర సమస్యలను సాధించుకునేందుకు విశ్రాంత ఉద్యోగులంతా సమష్టిగా కృషి చేయాలని సమావేశం తీర్మానించింది.ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సిరిగిరి రామకృష్ణారెడ్డి, ఆర్థిక కార్యదర్శి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, గౌరవ అధ్యక్షుడు ఓరుగంటి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు మేడి లింగయ్య, సంయుక్త కార్యదర్శి పెద్దిరెడ్డి కృష్ణారెడ్డి, వ్యవస్థాపక కార్యదర్శి ముజాహిద్ అలీ ఖాన్, సహాధ్యక్షుడు సదానందం, సుదర్శన్, కిషన్‌రావు, మేడిగా రఘు, తిరందాసు సత్తయ్య, బాలయ్య, హమీద్‌ఖాన్, సురయ్య బిల్గిస్, సుధారాణి, రామకృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పచ్చదనం పెంపే పర్యావరణ పరిరక్షణకు మార్గం - కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి




**కల్వకుర్తి/వెల్దండ, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పర్యావరణ పరిరక్షణ, పచ్చదన విస్తరణ లక్ష్యంగా నిర్వహిస్తున్న వనమహోత్సవ కార్యక్రమాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మొక్కలు నాటి పర్యావరణ సమతుల్యత కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు.

కల్వకుర్తి పట్టణంలోని జేపీనగర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో మొక్కల పాత్ర కీలకమని, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ పచ్చదన పెంపులో భాగస్వాములు కావాలని సూచించారు.అనంతరం కల్వకుర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్‌కుమార్ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని, వారిని శాలువాతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇక వెల్దండ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పర్యావరణ సమతుల్యతను కాపాడాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రకృతిని పరిరక్షించడం ద్వారా భావితరాలకు మెరుగైన జీవన వాతావరణం అందించవచ్చని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి గిరి గౌడ్, వార్డు సభ్యురాలు పాలాది మల్లీశ్వరి రంగనాథం, మసిగుండ్ల వెంకటేష్, మరిపల్లి మంజుల శ్రీను, రేవల్లి మానస రాజు, సత్యనారాయణ, గ్రామపంచాయతీ సిబ్బంది, కరోబార్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కొర్ర రాంసింగ్ నాయక్

**– గిరిజన సర్పంచుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్న నూతన నాయకుడు**

**దేవరకొండ, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ గిరిజన సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక (వర్కింగ్) అధ్యక్షుడిగా దేవరకొండ మండలంలోని మైనంపల్లి గ్రామ సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్ నియమితులయ్యారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన తెలంగాణ గిరిజన సర్పంచుల సంఘం రాష్ట్ర ఆవిర్భావ సదస్సులో రాష్ట్ర అధ్యక్షుడు భూక్య సంతోష్ నాయక్ ఈ నియామకాన్ని ప్రకటించారు.ఈ సందర్భంగా కొర్ర రాంసింగ్ నాయక్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా గిరిజన సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సంఘం తరపున నిరంతరం కృషి చేస్తానని అన్నారు. గ్రామీణాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడతామని తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గంలో బంజారా సామాజిక వర్గానికి చెందిన సీనియర్ ఎమ్మెల్యేలకు ప్రాతినిధ్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే గిరిజన గ్రామపంచాయతీల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని, సర్పంచుల గౌరవ వేతనాన్ని రూ.30 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర గిరిజన సర్పంచుల హక్కులు, సంక్షేమం, గ్రామపంచాయతీల అభివృద్ధి కోసం సంఘం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆయన నియామకాన్ని గిరిజన సర్పంచులు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

# ధూళికట్టలో వైభవంగా ఎల్లమ్మతల్లి బోనాలు



**– భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించిన గౌడ కులస్థులు**



**ఎలిగేడు, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శ్రావణమాసాన్ని పురస్కరించుకుని గౌడ కులస్థుల ఆరాధ్య దైవమైన శ్రీ రేణుక ఎల్లమ్మతల్లి బోనాల ఉత్సవాలు ఎలిగేడు మండలం ధూళికట్ట గ్రామంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు భక్తి, శ్రద్ధల మధ్య వైభవంగా సాగాయి.

ఈ సందర్భంగా గ్రామంలోని సుమారు 150 గౌడ కుటుంబాలు ఇంటికో బోనం సమర్పిస్తూ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించాయి. బైండ్ల పూజారులు డప్పు చప్పుళ్ల మధ్య బోనాల ఊరేగింపును ముందుండి నడిపించగా, మహిళలు పూనకాలతో భక్తి పరవశంలో పాల్గొన్నారు. గ్రామ ప్రధాన రహదారి మార్గంగా ఊరేగిన బోనాలను తాటి, ఈత వనంలో ఉన్న ఎల్లమ్మతల్లి ఆలయానికి తీసుకెళ్లారు. అనంతరం భక్తులు బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. పసుపు, కుంకుమలు సమర్పించి, ఒడి బియ్యం పోసి టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ కుటుంబాల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాల కోసం మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు భూసారపు నర్సయ్యగౌడ్, ఉపాధ్యక్షుడు పూదరి వెంకటేశంగౌడ్, కార్యవర్గ సభ్యులు రంగు కొమురయ్యగౌడ్, భూసారపు రమేశ్ గౌడ్, పడాల నరేశ్ గౌడ్, కోటగిరి పరుశరాములు గౌడ్, కొయ్యడ నర్సయ్య, భూసారపు లక్ష్మయ్య, బాలుసాని భూమయ్యతో పాటు గౌడ సంఘం యువత, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హాస్టల్ విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**– పెండింగ్ మెస్ ఛార్జీలు విడుదల చేసి రెగ్యులర్ వార్డెన్లను నియమించాలి**
**– ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బలముల ప్రేమ్‌కుమార్ డిమాండ్**




**అచ్చంపేట, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అచ్చంపేట నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో నివసిస్తూ విద్యాభ్యాసం కొనసాగిస్తున్న పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి బలముల ప్రేమ్‌కుమార్ డిమాండ్ చేశారు. హాస్టళ్లను సందర్శించి విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ, హాస్టళ్లలో పెండింగ్‌లో ఉన్న మెస్ ఛార్జీలను వెంటనే విడుదల చేయాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, తగిన బెడ్లు, పరుపులు, స్వచ్ఛమైన తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. దోమల బెడద నుంచి విద్యార్థులను రక్షించేందుకు కిటికీలకు జాలీలు ఏర్పాటు చేయాలని సూచించారు. శిథిలావస్థకు చేరిన హాస్టల్ భవనాలకు మరమ్మతులు చేపట్టడంతో పాటు అవసరమైన చోట్ల నూతన భవనాలు నిర్మించాలని కోరారు. బాలుర, బాలికల హాస్టళ్లలో రెగ్యులర్ వార్డెన్లను నియమించి విద్యార్థుల సంక్షేమంపై అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు విద్యాభ్యాసం కోసం ప్రభుత్వ హాస్టళ్లపైనే ఆధారపడుతున్నారని, వారి సమస్యలను నిర్లక్ష్యం చేయడం సమంజసం కాదని ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అచ్చంపేట నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రీతం, వినయ్, మహేష్, శివ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

**– యువత భారీ సంఖ్యలో పాల్గొనాలి: ఏఐవైఎఫ్ నాయకులు**
**– రాష్ట్ర మహాసభల పోస్టర్లు, కరపత్రాల ఆవిష్కరణ**



**డిండి, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని, యువత అధిక సంఖ్యలో పాల్గొని తమ సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకు రావాలని ఏఐవైఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో యాదగిరిగుట్టలో జరగనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల సందర్భంగా డిండి మండల సీపీఐ ప్రజాభవన్‌లో సోమవారం రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్, కరపత్రాలను ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు కాంపల్లి ప్రవీణ్, కార్యదర్శి ఎలిమినేటి నరేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం, ఉపాధి, విద్య, సామాజిక సమస్యల పరిష్కారానికి యువజన ఉద్యమాలు మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయని విమర్శించారు.
కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించినప్పటికీ ఆ హామీ అమలుకు నోచుకోలేదని పేర్కొన్నారు. అలాగే అగ్నిపథ్ విధానాన్ని ప్రవేశపెట్టి సైనిక ఉద్యోగాలను కాంట్రాక్టు విధానంలోకి తీసుకురావడం యువత భవిష్యత్తుకు అనుకూలం కాదని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణపై కూడా ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా యువతకు ఇచ్చిన హామీల అమలులో ఆశించిన స్థాయిలో ముందుకు వెళ్లడం లేదని ఆరోపించారు. హామీల అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే యువతను చైతన్యపరిచి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. డిండి మండల అభివృద్ధి, యువత సమస్యల పరిష్కారం కోసం ఏఐవైఎఫ్ నిరంతరం పోరాడుతుందని, యువత ఉద్యమాలలో భాగస్వాములు కావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ డిండి మండల ఉపాధ్యక్షులు నూనె భూపాల్, రాజు, అరుణ్, నవాజ్, సురేష్, స్టీవెన్ తదితరులు పాల్గొన్నారు.

# రాములపల్లిలో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యం పట్టివేత

– 16.30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం.. కేసు నమోదు



**ఎలిగేడు, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అక్రమంగా నిల్వ చేసిన పీడీఎస్ రేషన్ బియ్యాన్ని ఎలిగేడు పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై మధుకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ సీడం పోచయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎలిగేడు మండలం రాములపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గంగిరెడ్డుల కాలనీ సమీపంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. అక్కడ తాత్కాలికంగా ఏర్పాటు చేసిన గుడిసెలో అక్రమంగా నిల్వ ఉంచిన 16.30 క్వింటాళ్ల (40 బస్తాలు) పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ క్వింటాలుకు రూ.4,584 చొప్పున మొత్తం సుమారు రూ.74,719 ఉంటుందని అధికారులు తెలిపారు. బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసిన సుల్తానాబాద్ పట్టణంలోని యాదవనగర్‌కు చెందిన చింతల యాదగిరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. సాక్షుల సమక్షంలో పంచనామా నిర్వహించి పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకోవాలని ఫిర్యాదు దారు, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ పోచయ్యను ఎస్సై మధుకర్ కోరారు. పంచనామా సందర్భంగా నిందితుడు రేషన్ లబ్ధి దారుల నుంచి కిలోకు రూ.12 చొప్పున తక్కువ ధరకు బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి, అనంతరం అధిక ధరకు విక్రయిస్తున్నట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుకర్ వెల్లడించారు.

# వర్షాలు కురవాలని గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు

**– పల్లెచెల్కతండాలో జలాభిషేకాలు.. పంటల సాగు వెనుకబడుతోందని రైతుల ఆవేదన**



**కడ్తాల్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వర్షాభావ పరిస్థితులతో పంటల సాగు ఆలస్యమవుతున్న నేపథ్యంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని కోరుతూ కడ్తాల్ మండలం పల్లెచెల్కతండాలో గ్రామస్థులు, రైతులు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరుణదేవుడు కరుణించి సకాలంలో వర్షాలు కురిపించాలని ప్రార్థించారు. మంగళవారం తండా మహిళలు దుర్గాభవాని, సేవాలాల్ మహారాజ్‌లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టపర్తి సత్యసాయి బాబా సేవా సమితి ఆధ్వర్యంలో నిర్మించిన ముత్యాలమ్మ అమ్మవారికి నీటిబిందెలు, పాలతో జలాభిషేకం చేశారు. సర్పంచ్ విస్లావత్ నీలావతి, ఉపసర్పంచ్ ప్రియమణి, వార్డు సభ్యులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ విస్లావత్ నీలావతి మాట్లాడుతూ.. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పంటల సాగు వెనుకబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే వర్షాభావ పరిస్థితులు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు. వరుణుడు కరుణించకపోవడంతో పంటల సాగు దాదాపు నెల రోజుల వరకు వెనక్కి వెళ్లిందన్నారు. సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండాలని, పంటలు సస్యశ్యామలంగా పండాలని గ్రామదేవతలను వేడుకున్నట్లు ఆమె తెలిపారు. రైతుల కష్టాలు తొలగి సాగు పనులు వేగం పుంజుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లోక్యానాయక్, విశాలావత్ శ్రీనునాయక్, విస్లావత్ బాలు, మాజీ ఉపసర్పంచ్ సీతారాం, గ్రామ పెద్దలు బాలు నాయక్, నారియా నాయక్, గిరిజన మహిళలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌పై 27న వార్డు సభలు

**– పోలింగ్ స్టేషన్‌ల వారీగా నిర్వహణ.. మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్**




**కల్వకుర్తి, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు చేపడుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 27న కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలో పోలింగ్ స్టేషన్‌ల వారీగా వార్డు సభలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఈ నెల 17న డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్‌ను ప్రచురించినట్లు తెలిపారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు సందేహాలను నివృత్తి చేసేందుకు ఈ నెల 27న ఉదయం 10.30 గంటలకు వార్డు సభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సభల్లో సంబంధిత పోలింగ్ స్టేషన్ పరిధిలోని డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్‌ను చదివి వినిపిస్తామని కమిషనర్ తెలిపారు. ఓటర్లకు ఏవైనా సందేహాలు, అభ్యంతరాలు ఉంటే వార్డు సభల్లో సంబంధిత అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చని సూచించారు. డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్‌లో పేరు లేని వారు, అలాగే నోటీసులు అందుకున్న వారికి సమర్పించాల్సిన పత్రాలు, ఇతర వివరాలను సైతం వార్డు సభల్లో తెలియజేస్తామని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వార్డు సభలకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిషనర్ మహమూద్ షేక్ విజ్ఞప్తి చేశారు.

# నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి

**– పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లు: సర్పంచ్ కొమ్మగోని రాజేశ్వరి రవిగౌడ్**



**కల్వకుర్తి, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పర్యావరణ పరిరక్షణ, వాతావరణ సమతుల్యతకు మొక్కలు ఎంతో కీలకమని, వనమహోత్సవంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని జిల్లెల్ల గ్రామ సర్పంచ్ కొమ్మగోని రాజేశ్వరి రవిగౌడ్ అన్నారు. 'పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లు' అనే నినాదంతో గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మంగళవారం కల్వకుర్తి మండల పరిధిలోని జిల్లెల్ల గ్రామంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొమ్మగోని రాజేశ్వరి రవిగౌడ్ గ్రామపంచాయతీ సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, వాటిని సంరక్షించడం అంతకంటే ముఖ్యమని పేర్కొన్నారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందిస్తూ, పశువుల నుంచి రక్షణ కల్పించి అవి ఏపుగా పెరిగేలా చూడాలని సూచించారు. పచ్చదనం పెరిగితే గ్రామ వాతావరణం ఆహ్లాదకరంగా మారడంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందుతుందని తెలిపారు. వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో గ్రామస్థులు, యువత, మహిళలు భాగస్వాములు కావాలని సర్పంచ్ కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎముక రవి, పంచాయతీ కార్యదర్శి తిరుపతిగౌడ్, వార్డు సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటితే భవిష్యత్ తరాలకు మేలు



**– పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: అడిషనల్ డీఆర్డీవో మల్లేశ్**
**– ధూళికట్ట, ఎలిగేడులో ఘనంగా వనమహోత్సవ కార్యక్రమాలు**

**ఎలిగేడు, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని అడిషనల్ డీఆర్డీవో మల్లేశ్ అన్నారు. ఎలిగేడు మండలంలోని ధూళికట్ట గ్రామంలో మంగళవారం సర్పంచ్ కొమురయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడిన మల్లేశ్, పర్యావరణ సమతుల్యత కోసం ప్రతి గ్రామం పచ్చదనంతో కళకళలాడాలని, ప్రతి వ్యక్తి మొక్కలను నాటి వాటి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.
కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్‌రావు, సర్పంచ్ కొమురయ్య, ఉప సర్పంచ్ అందాలు, పంచాయతీ కార్యదర్శి అజ్మీర జ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్ శ్యామల, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.
అదే విధంగా ఎలిగేడు మండల కేంద్రంలో సర్పంచ్ కప్పల ప్రవీణ్, ఉప సర్పంచ్ ముంజం నరేష్ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో వివిధ రకాల మొక్కలను పంపిణీ చేసి మొక్కల నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఇంటా మొక్క పెంచాలని నాయకులు పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముంజం నరేష్, వార్డు సభ్యులు నరేందర్, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ కౌన్సిలర్ కొలీపాక శ్రీనివాస్ జన్మదిన వేడుకలు

**– రోగులకు పండ్లు పంపిణీ చేసిన ముదిరాజ్ సంఘం నాయకులు**





**ఎలిగేడు, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి మున్సిపల్ మాజీ కౌన్సిలర్, ముదిరాజ్ సంఘం నాయకుడు కొలీపాక శ్రీనివాస్ జన్మదిన వేడుకలను ముదిరాజ్ కులస్తులు ఘనంగా నిర్వహించారు. నారాయణపల్లి మాజీ ఉపసర్పంచ్ సబ్బు శ్రీధర్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కొలీపాక శ్రీనివాస్ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలుస్తూ అనేక సంక్షేమ, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. ముదిరాజ్ సామాజిక వర్గ అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఆయన ఆయురారోగ్యాలతో మరెన్నో సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు. జన్మదిన వేడుకల్లో భాగంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సబ్బు మల్లయ్య, కార్యదర్శి మేకల రవికిరణ్, డైరెక్టర్లు సబ్బు శంకర్, చొప్పరి మల్లయ్య, సబ్బు లక్ష్మణ్, పోతుగంటి సురేష్‌తో పాటు ముదిరాజ్ కుల సంఘం సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

# కార్మికులకు అండగా.. ఉచిత ఆరోగ్య పరీక్షలు

**– ఎలిగేడులో లేబర్ కార్డుదారులకు 30 రకాల వైద్య పరీక్షలు**



**ఎలిగేడు, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎలిగేడు సర్పంచ్ కప్పల ప్రవీణ్ సూచించారు. కార్మికులు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలను తొలిదశలోనే గుర్తించి తగిన చికిత్స పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎలిగేడు మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ కప్పల ప్రవీణ్ ఆధ్వర్యంలో మంగళవారం లేబర్ కార్డులు కలిగిన కార్మికులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఎస్సీ హెల్త్‌కేర్ సేవల ద్వారా కార్మికులకు బీపీ, రక్త పరీక్షలతో పాటు సుమారు 30 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల ఆరోగ్య పరిస్థితిని ముందుగానే గుర్తించి, అవసరమైన వారికి వైద్యుల సలహాలు, తదుపరి చికిత్సకు సంబంధించిన సూచనలు అందించేలా చర్యలు చేపట్టారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని నిర్వాహకులు సూచించారు. సర్పంచ్ ప్రవీణ్ మాట్లాడుతూ.. కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి ఉచిత వైద్య పరీక్షలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సేవలను అర్హులైన కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముంజం నరేశ్, వార్డు సభ్యుడు మడుపు నరేందర్, నాయకులు శ్రీనివాస్, ప్రభాకర్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం



**కల్వకుర్తి, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోందని ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ అన్నారు. కల్వకుర్తి మండల పరిధిలోని గుండూర్ గ్రామానికి చెందిన వడ్ల విమలమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామ బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు, కార్మిక సంఘం అధ్యక్షుడు సూర్యప్రకాశ్‌రావు, గ్రామ సర్పంచ్ అయిననేని లక్ష్మమ్మ ద్వారా సమాచారం అందడంతో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ స్పందించారు. మంగళవారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి, తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పల వెంకటేష్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న కుటుంబాలకు తనవంతు సహాయాన్ని అందించడం బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. పేద కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్మిక సంఘం అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ సూర్యప్రకాశ్‌రావు, బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఉపసర్పంచ్ నాగయ్య, మాజీ ఉపసర్పంచ్ బండి లక్ష్మయ్య, వార్డు సభ్యుడు రాజేందర్, పోతరపల్లి కృష్ణయ్య, పోతుగంటి నాగేంద్రం, తుప్పల సత్యనారాయణ, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ టెర్రరిజం కేసు రామగుండంలో 'ఉగ్ర' లింకుల కలకలం




**పెద్దపల్లి జిల్లా :** రామగుండం పట్టణానికి చెందిన ఓ యువకుడి ఇంట్లో ఎన్ఐఏ సోదాలు చేపట్టి ంది. గుజరాత్‌కు చెందిన ఎన్ఐఏ బృంద ం రామగుండం అయోధ్యనగర్‌లో ఉండే డెంట ల్ డాక్టర్ ఆయుబ్‌ఖాన్ కుమారుడు ముజామి ల్‌ను తెల్లవారుజామున విచారణ చేసింది. ఉగ్రవాద సంస్థకు చెందిన పలు టెలిగ్రామ్ గ్రూప్‌లలో ముజామిల్ మెంబర్?గా ఉండటం తో వివిధ కోణాల్లో ప్రశ్నించి, వివరాలు సేకరించినట్లు సమాచారం.అయితే ఏఐ కోర్సు నేర్చుకోవడం కోసం ఆయా గ్రూపుల్లో చేరానని, ఏడాదిన్నర క్రితమే వాటి నుంచి బయటకు వచ్చినట్లు ముజామిల్ చెప్పినట్లు తెలిసింది. సెప్టెంబర్ 15న అహ్మదాబాద్‌లోని ఎన్ఐఏ ఆఫీస్‌లో విచారణకు హాజరుకావాలని ముజామి ల్‌కు ఎన్ఐఏ అధికారులు నోటీసులు ఇచ్చారు. ముజామిల్ ల్యాప్‌టాప్‌ను రామగుండం పోలీసులకు అప్పగించి సాంకేతిక అంశాలపై వివరాలు సేకరించారు. ఈ విషయంలో ఎన్ఐఏ అధికారులు, స్థానిక పోలీసులు అధికా రికంగా ఎలాంటి వివరాలను వెల్లడిం చలేదు.స్థానికంగా కలకలం : రామగుండంలో జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు తనిఖీలు చేయడం కలకలం రేపింది. అయితే గతంలోనూ ఇలాంటి తనిఖీలు చేయగా, టెర్రరిస్టుల లింకులు బయటపడటంతో స్థానిక వాసులు మరోసారి తీవ్రంగా చర్చించుకుం టున్నారు.పలు ఉదంతాలివీ : అహ్మదాబాద్‌లో నమోదైన సైబర్ టెర్రరిజం కేసుకు సంబంధించి దేశవ్యాప్తంగా 5 చోట్ల ఎన్?ఐఏ సోదాల్లో భాగంగా ఈ తనిఖీలు జరిగినట్లు సమాచారం. టెలిగ్రామ్ గ్రూపుల ద్వారా ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) కోర్సుల పేరుతో విదేశీ హ్యాండర్లు యువతను ఆకర్షించి, వారి ద్వారా సైబర్, దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో ఎన్ఐఏ సోదాలు జరిపింది. సుమారు 20 ఏళ్ల క్రితం రామగుండంలో ఓ యువకుడిని ఉగ్ర లింకులతో అదుపులోకి తీసుకున్న విషయం ఈ సమయంలో స్థానికులు గుర్తు చేసుకుంటున్నారు.కరీంనగర్ జిల్లా కేంద్రంపై ఎన్ఐఏ గత కొన్నేళ్లుగా పటిష్ఠమైన నిఘా ఉంచింది. 2023 ఆగస్టులో హుస్సేనిపు రా కాలనీలోని ఓ యువకుడి ఇంట్లో తెల్లవాం ుజామున 4 గంటలకే తనిఖీలు నిర్వహించారు. నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ)తో ఇతనికి ఉన్న లింకులపై అధికారు లు ఆధారాలను సేకరించారు. నిందితుడు విదేశాల్లో ఉంటున్నప్పటికీ ఇంట్లో లభించిన డిజిటల్ పరికరాలు, కంప్యూటర్ హార్డ్ డిస్క్‌లను ఎన్?ఐఏ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. యువకులకు ఉన్న సంబంధాలపై ఆరా : జగిత్యాల పట్టణంలో 2023 సెప్టెంబరులో జరిగిన సోదాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. నిజామాబాద్‌కు చెందిన పీఎఫ్ఐ సానుభూతిపరుడితో జగిత్యాల యువకులకు ఉన్న సంబంధాలపై ఎన్ఐఏ విస్తృతంగా ఆపరేషన్ చేపట్టింది. టీఆర్?నగర్, టవర్ సర్కిల్‌లోని పలు మెడికల్ దుకాణాలతో పాటు సుమారు 7 ప్రాంతాల్లో ఒకేసారి సోదా లు జరిగాయి. ఇదే రోజు కరీంనగర్‌లో ఆశ్ర యం పొందుతున్న జగిత్యాల వాసిని అధికా రులు అదుపులోకి కూడా తీసుకున్నారు.

# సీజనల్ పరిస్థితులు, నీట్ పీజీ పరీక్ష ఏర్పాట్లపై కలెక్టర్లతో సీఎస్ సమీక్ష



**హైదరాబాద్, ఆగస్టు 25:** రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మంగళవా రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీజనల్ పరిస్థితులు, ప్రజలకు అవసరమైన సేవలు, నీట్ పీజీ ప్రవేశ పరీక్ష ఏర్పాటు తదితర అంశాలపై కలెక్టర్లతో ఆయన సమీక్షించారు. ఆయా అంశాలపై చేపడుతున్న చర్యలను కలెక్ట ర్లను ఆయన అడిగి తెలుసుకు న్నారు.సీజనల్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని వారికి సీఎస్ సూచించారు. వర్షాలు, వరదలు నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంట నే స్పందించేలా జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.ఇక నీట్ పీజీ ప్రవేశ పరీక్ష నిర్వహణకు సంబంధించి జిల్లాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సీఎస్ ప్రత్యేకంగా సమీక్షించారు. పరీక్షా కేంద్రాల వద్ద మౌలిక వసతులు, భద్రత, విద్యుత్, తాగునీరు, పారిశు ద్ధ్యం, రవాణా తదితరత అంశాలపై అధికారు లతో చేయాలని సూచించారు. ఈ ప్రవేశపరీక్షను ప్రశాంతంగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లను సీఎస్ సంజయ్ జాజు ఆదేశించారు.

# మున్సిపల్ చైర్‌పర్సన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మాజీ కౌన్సిలర్ గోరేటి శ్రీనివాసులు




**కల్వకుర్తి, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్‌కుమార్ జన్మదినం సందర్భ ంగా 7వ వార్డు మాజీ కౌన్సిలర్ గోరేటి శ్రీనివా సులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం కల్వకుర్తి మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన గోరేటి శ్రీనివాసులు శాలువాతో సత్కరించారు. అనంతరం ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నమాల ఆనంద్‌కుమార్‌కు పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# రేవంత్ రెడ్డితో దేశ భద్రతకు ముప్పు

**హైదరాబాద్, ఆగస్టు 25:** ఎంపీ అర్వింద్ సంచలన వ్యాఖ్యలుదేశ వ్యతిరేక శక్తులతో రేవంత్ రెడ్డి చేతులు కలుపుతున్నారన్న అర్వింద్‌దేశంపై విషం చిమ్మే వారితో మాట్లాడి రాజకీయ లబ్ధి పొందేందుకు యత్నిస్తు న్నారని వ్యాఖ్యకేసీఆర్ కంటే రేవంత్ రెడ్డి ప్రమాదకరమైన వ్యక్తి అని వ్యాఖ్యఇకపై రేవంత్ ప్రతి కదలిక జాతీయ భద్రతా సంస్థల పరిశీలనలో ఉంటుందని వెల్లడిఅమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడంపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ తీవ్రంగా తప్పుబట్టారు. రేవంత్ రెడ్డి వ్యవహారశైలి రాష్ట్ర శాంతిభద్రతలకే కాకుండా దేశ భద్రతకు కూడా ముప్పుగా మారుతోందని ఆరోపించారు.విదేశీ పర్యటనల్లో రేవంత్ రెడ్డి దేశ వ్యతిరేక శక్తులతో చేతులు కలుపుతున్నారని అర్వింద్ విమర్శిం చారు. విదేశాల్లో దేశంపై విషం చిమ్మే వారితో మాట్లాడటం ద్వారా రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపి ంచారు. కేసీఆర్ కంటే రేవంత్ రెడ్డి ప్రమాదకరమైన వ్యక్తి అని తాను గతంలోనే చెప్పానని, ఇకపై ఆయన ప్రతి కదలిక జాతీయ





భద్రతా సంస్థల పరిశీలనలో ఉంటుం దని వ్యాఖ్యానించారు. మరోవైపు రాష్ట్ర ంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి లపై కూడా అర్వింద్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బకాయిలు చెల్లించకపో వడంతో విద్యా సంస్థలు మూతపడే పరిస్థితి ఏర్పడిం దని ఆరోపించారు. బకాయిలను క్లియర్ చేస్తామని రాహుల్ గాంధీతో హామీ ఇప్పించినా ఆ హామీ అమలు కాలేదని విమర్శించారు. రాష్ట్రంలోని విద్యాసంస్థలను పట్టించుకో కుండా విదేశాల నుంచి కొత్త విద్యాసం స్థలను తీసుకొస్తామని చెప్పడం ఏంటని అర్వింద్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి పరిపాలన చేతకాదని తెలంగాణ ప్రజలు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారని అన్నారు.

# మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ కేసు.

**హైదరాబాద్, ఆగస్టు 25:** మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ కేసులో కీలక పరిణా మం చోటుచేసుకుంది. ఈ కేసులో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలతో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ సీఐ ముత్తు యాదవ్‌పై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. ఈ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో అలసత్వం వహించడంతో పాటు.. కేసు నమోదైన తర్వాత నిందితుడిని అదుపులోకి తీసుకునే విషయంలోనూ నిర్లక్ష్యంగా వహించా రనే ఆరోపణలపై పోలీస్ ఉన్నతాధికారులు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది.అయితే సీఐ ముత్తు యాదవ్ కేవలం 3 వారాల క్రితమే జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిం చారు. ఈ నేపథ్యంలోనే బాధ్యతలు చేపట్టిన కొన్ని రోజులకే ఇలా సస్పెన్షన్‌కు గురికావడం పోలీసు వర్గాల్లో తీవ్ర చర్చనీయా ంశంగా మారింది. ఈ కేసులో పోలీసుల దర్యాప్తు తీరుపై ఉన్నతాధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.జూబ్లీహిల్స్‌లోని సుమంత్ ఆఫీసుకు గత నెల 30వ తేదీన చెంగిచెర్లకు



చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి గొంగిడి హరికృష్ణను డబ్బు వ్యవహారంపై మాట్లాడేందుకు పిలిపించినట్లు పోలీసులు గుర్తించారు. అక్కడ సుమంత్‌తో పాటు అతని అనుచరులు ప్రశాంత్, అరుణ్ కుమార్‌రెడ్డి, కార్తీక్, మహేందర్‌రెడ్డి, రాము సహా పలువురు వ్యక్తులు హరికృష్ణపై ఇనుప రాడ్‌తో దాడి చేసినట్లు ఫిర్యాదు నమోదైంది.ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన హరికృష్ణ.. చెంగిచెర్ల పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశారు. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి.. ఆ తర్వాత ఆ కేసును జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. అయితే ఈ వ్యవహారం బయటకు రావడంతో సుమంత్ తన ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి పరారైనట్లు పోలీసు లు చెబు తున్నారు. ప్రస్తుతం ఆయన కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.పోలీస్ స్టేషన్లకి జేసీ స్టేషన్ అని పేరు పెట్టండి: కేతిరెడ్డి పెద్దారెడ్డి మంత్‌ను పట్టుకునేందుకు జూబ్లీహిల్స్ పోలీసు లు ఇప్పటికే మూడు ప్రత్యేక బృందాలను ఏర్పా టు చేశారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు కూడా మరో బృందంతో గాలింపు చేపట్టినట్లు తెలు స్తోంది. ఇప్పటికే ఈ కేసులో నలుగురిని అరెస్ట్ చేశారు. సుమంత్ డ్రైవర్ నవీన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. సుమంత్ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు, నిందితుడి అరెస్టు విషయంలో జూబ్లీహిల్స్ సీఐ ముత్తు యాదవ్ వ్యవహరించిన తీరుపై ఉన్నతాధికారులు సమీక్షించిన తర్వాత సస్పెన్షన్ నిర్ణయం తీసుకున్నారని పోలీస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# మైనారిటీ వర్గాల కోసం తాజుద్దీన్ చేసిన సేవలు మరువలేనివి



**హైదరాబాద్, ఆగస్టు 25:** బీఆర్ఎస్ పార్టీ మైనారిటీ విభాగం మాజీ అధ్యక్షుడు తాజుద్దీన్ అకాల మరణం పట్ల మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంగళవారం ఖమ్మం నగరంలో తాజుద్దీన్ పార్థివదేహాన్ని పువ్వాడ అజయ్ కుమార్ సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా తాజుద్దీన్‌తో తనకున్న అనుబంధాన్ని, పార్టీకి, మైనా రిటీ వర్గాల కోసం ఆయన అందించిన సేవలను పువ్వాడ అజయ్ కుమార్ గుర్తు చేసుకున్నారు. తాజుద్దీన్ మృతి పార్టీకి, మైనారిటీ వర్గాలకు తీరని లోటని, ఆయన లేని లోటును ఎవరూ పూడ్చలేరని అన్నారు. తాజుద్దీన్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు ఈ విషా దాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని అజయ్ కుమార్ ఆకాంక్షించారు.

# నషా ముక్త్ సమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకం

**నిజామాబాద్, ఆగస్టు 25 :** నషా ముక్త్ సమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకమని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా వ్యాఖ్యానించారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, విద్యా క్రీడా రంగాల్లో రాణించాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రజా ఉద్య మంగా రూపుదిద్దుకుంటుందని పేర్కొ న్నారు. నిజామాబాద్ జిల్లాలో (మంగళవారం) నషా ముక్త్ భారత్ అభియాన్‌పై విద్యార్థుల



తో ముఖాముఖి నిర్వహించారు.ఈ కార్యక్ర మంలో ముఖ్య అతిథిగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు సూర్యనారాయణ, రాకేశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, పోలీసు కమిషనర్ సాయి చైతన్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడారు. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నషా ముక్త్ భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు.

# ప్రతి మొక్కను సంరక్షించాలి.

**హైదరాబాద్, ఆగస్టు 25 :** రాష్ట్ర వ్యాప్తంగా వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని మంత్రి సీతక్క (ివశ్రీఖఅస్త్రుఅఖ వీఱఅఱర్‌వతీ ూవవిష్ఠుఎెఖ) సంబంధిత అధికారులను ఆదేశించారు. వన మహోత్సవం లక్ష్యాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈరోజు (మంగళవారం) రాష్ట్ర సచివాలయంలో గ్రామీణ అభివృద్ధి శాఖపై మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో కమిషనర్ దివ్య, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, జిల్లా సీఈవోలు, డీఆర్డీవోలు, డీపీవో, అడిషనల్ డీఆర్డీవోలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి సీతక్క దిశానిర్దేశం చేశారు. ఉపాధి హామీ పనులు, పంట కుంటల నిర్మాణం, మహిళా సంఘ భవనాల నిర్మాణం, నూతన చేయూత పెన్షన్ల మంజూరుపై సమీక్షించారు. ఇప్పటివరకు ఇచ్చిన టార్గెట్‌లో 86శాతం మొక్కలు నాటామని తెలిపారు. 6.18 కోట్ల మొక్కలు నాటి లక్ష్యాన్ని నిర్దేశించుకుని 5.32 కోట్ల మొక్కలను నాటినట్లు వెల్లడించారు.మొక్కలు నాటిన విధంగానే.. నాటిన మొక్కల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. ప్రతి మొక్కను సంరక్షిస్తూ వందశాతం మనుగడ సాధించాలని చెప్పారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీటిని అందించాలని



సూచించారు. ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలు, విద్యార్థులు, యువతను భాగస్వాములను చేయాలని దిశానిర్దేశం చేశారు. మొక్కలకు రక్షణ కంచెలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని తెలిపారు. అవెన్యూ ప్లాంటేషన్లలో ఫెన్సింగ్ పటిష్ఠంగా ఉండేలా చూడాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో రోజుకు కనీసం 60 మంది కూలీలకు ఉపాధి కల్పించాలని తెలిపారు.పనికి సిద్ధంగా ఉన్న ప్రతి కూలీకి పని అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క ఆదేశించారు. కూలీలకు వారి నివాస ప్రాంతానికి సమీపంలోనే ఉపాధి కల్పించాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో తగినంత పనుల షెల్ఫ్ సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. చీవీమీ హాజరును ప్రతిరోజూ పర్యవేక్షించాలని మార్గనిర్దేశం చేశారు. కూలీల సమీకరణ బాధ్యతను క్షేత్రస్థాయి సిబ్బందికి స్పష్టంగా అప్పగించాలని నిర్దేశించారు. మంజూరైన అన్ని ఫార్మ్ పాండ్ల పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు.ఉపాధితో పాటు నీటి సంరక్షణకు శాశ్వత ఆస్తులుగా అభివృద్ధి చేయాలని మంత్రి సీతక్క సూచించారు. తక్కువ పనితీరు ఉన్న జిల్లాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించి నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఉపాధి పనులతో పాటు నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ఆదివాసి గిరిజన ఏజెన్సీ ప్రాంతాల్లో చెక్ డ్యాముల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని నిర్దేశించారు. ఫార్మ్ పాండ్లు, ఇతర నీటి సంరక్షణ పనులను వేగంగా ప్రారంభించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, నీటి సంరక్షణ, జీవనోపాధి ఆస్తుల సృష్టి ఏకకాలంలో జరగాలని చెప్పారు. ప్రభుత్వ లక్ష్యాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు.